ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
20 వరంగల్ రూరల్
బుధవారం 9, ఆగస్టు 2017



ఈ-పాస్ యంత్రాలొచ్చాయి..


ఈ-పాస్ యంత్రం

- జిల్లాకు 464యంత్రాల రాక..
- వినియోగంపై 10,11,16 తేదీల్లో శిక్షణ
- ప్రజాపంపిణీలో సరుకుల అక్రమాలకు ఇక చెక్
- పెరుగునున్న పారదర్శకత
- జిల్లా పౌర సరఫరాల అధికారి పీటర్

20

డబుల్ డ్యూటీలు..!

- విద్యాశాఖలో ఇన్‌చార్జీల పాలన
- హెచ్‌ఎంలకు ఎంఈవోల బాధ్యత
- ఒక్క నల్లబెల్లిలో మాత్రమే రెగ్యులర్ అధికారి
- కుంటుపడుతున్న విద్యావ్యవస్థ
- సరిగా సాగని తరగతులు
- మూడేళ్లుగా రెగ్యులర్ నియామకాల నిల్
- పోస్టులను భర్తీ చేయాలని డిప్యూటీ సీఎంకు విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి



జిల్లాలో రెగ్యులర్ మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈవో)లేక విద్యావ్యవస్థ కునారిల్లుతోంది. పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకే ఇన్‌చార్జి మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్లుగా బాధ్యతలను అప్పగించడంతో బోధన కుంటుపడుతోంది. ఒక్క నల్లబెల్లి మండలంలో మాత్రమే రెగ్యులర్ ఎంఈవో ఉండగా.. మిగితా 14చోట్ల హెచ్‌ఎంలే ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. దీంతో విద్యార్థులకు పాఠాలు చెప్పలేక.. ఎంఈవో పోస్టుకు సరైన న్యాయం చేయలేక ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పర్మినెంట్ ఎంఈవోలను నియమించి.. విద్యావ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది.

- నర్సంపేట



2

రూ.1150కోట్లతో టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణం


సంగెంలో జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభించి మాట్లాడుతున్న కడియం

- లక్షా 13వేల మందికి ఉపాధి అవకాశాలు...
- పార్క్ శంకుస్థాపన కోసం 17న రానున్న సీఎం కేసీఆర్?
- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి
- సంగెం జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభం

8

రవాణా శాఖలో నియామకాల ఊసేది?

సెంటర్ స్పెషల్

- 15ఏళ్లుగా ఖాళీ పోస్టుల భర్తీపై దృష్టిసారించని ప్రభుత్వాలు
- 67పోస్టుల్లో సగానికిపైగా ఖాళీ.. పౌరసేవల్లో తీవ్ర జాప్యం

మిర్చి పరిశోధనా కేంద్రానికి...

జేసీ స్థల పరిశీలన

- ఫారెస్టు అధికారులతో అశోక్‌నగర్‌లో సందర్శన


అశోక్‌నగర్‌లో స్థల పరిశీలన చేస్తున్న జేసీ హరిత

20

‘డబుల్’ డ్యూటీలు..!

కొనసాగుతున్న ఇన్‌చార్జిల పాలన
హెచ్ఎంలకు ఎంఈవోల బాధ్యత

■ నర్సంపేట

విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం పర్మినెంట్ విద్యాశాఖ అధికారులను నియమించడంలో విఫలమవుతోంది. గత ప్రభుత్వాల మాదిరిగానే మూడేళ్ల క్రితం అధికారం చేపట్టిన టీఆర్ఎస్ పాలనలో కూడా విద్యాశాఖ పరిస్థితి గందరగోళంగా తయారైంది. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన విద్యాశాఖలో ఇన్‌చార్జి మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్(ఎంఈవో)ల పాలన కొనసాగుతోంది.

జిల్లాలో మొత్తం 690 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 454ప్రాథమిక పాఠశాలలు, 78ప్రాథమికోన్నత పాఠశాలలు, 158 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. సుమారుగా లక్షా 50వేల మంది విద్యార్థులు ఆయా స్కూళ్లలో చదువుతున్నారు. ఇన్‌చార్జిల పాలనలో విద్యావ్యవస్థలో జవాబుదారీతనం కొరవడుతోంది. ఎంఈవోల బాధ్యత తాత్కాలికం కావడంతో అధికారులు తేలికగా తీసుకుంటున్నారు. పనిచేసే పాఠశాలలో విద్యార్థులు పాఠాలు చెప్పలేక పాఠశాల స్థితిగతులపై దృష్టి పెట్టలేక బాధ్యతలు నిర్వహించలేక ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విపాత్రాభినయనం(డబుల్ డ్యూటీ) చేయలేక ఇన్‌చార్జి ఎంఈవోలు సతమతమవుతున్నారు. జిల్లాలోని 15మండలాల్లో ఒక్క నల్లబెల్లి మండలం మినహా మిగిలిన 14మండలాల్లో కొంతకాలంగా హెచ్ఎంలే ఇన్‌చార్జి ఎంఈవోలుగా కొనసాగుతున్నారు.

సిలబస్ పూర్తికాక విద్యార్థుల ఇబ్బందులు

జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఇన్‌చార్జి ఎంఈవోలు విద్యార్థులకు పాఠాలు చెప్పకపోవడంతో సకాలంలో సిలబస్ పూర్తికాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వారు పనిచేసే పాఠశాలల్లో ఇన్‌చార్జి ఎంఈవోల బదులు స్కూల్ అసిస్టెంట్లు, సీనియర్ ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యబోధన చేయాల్సి ఉంటుంది. చాలా పాఠశాలల్లో వారు బోధన చేయకపోవడంతో ప్రతీ ఏటా ఫిబ్రవరి వరకే పూర్తి కావాల్సిన సిలబస్ పూర్తికాక విద్యార్థులు వార్షిక పరీక్షల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు.



ఇటుకాలపల్లి జడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థితో బోర్డుపై రాయిస్తున్న ఎంఈవో

రెగ్యూలర్ ఎంఈవోలను నియమించాలి

ఎంఈవోలను నియమించాలని విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరిని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యారంగంలో ఇన్‌చార్జిలతో కొనసాగుతున్న పాలనను గుర్తించి రెగ్యూలర్ ఎంఈవోలను నియమించాలని కోరుతున్నారు.

14మండలాల్లో ఇన్‌చార్జిలదే పాలన

జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారుల్లో ఒకరు మినహా అందరూ ఇన్‌చార్జిలే. 15మండలాల్లో నల్లబెల్లిలో రెగ్యూలర్ మండల విద్యాశాఖ అధికారి ఉండగా 14మండలాల్లో కొన్నేళ్లుగా ఇన్‌చార్జిలతోనే కాలం వెల్లదీస్తున్నారు. సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఇన్‌చార్జి ఎంఈవోలుగా నియమించారు. ఎంఈవోలకు పనుల ఒత్తిడితో తీరిక లేకపోవడంతో హెచ్ఎంలుగా నిర్వహించాల్సిన పాఠశాలల్లో సీనియర్ అసిస్టెంట్లపై భారం పడుతుంది.

ఎంఈవోల విధులు బాధ్యతలు

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఇన్‌చార్జి ఎంఈవోలు ప్రతీ ఏటా విద్యా సంవత్సరం ఆరంభంలోనే మండలాల్లో ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించాలి. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందా లేదా ఉపాధ్యాయులు సమయనుకూలంగా పాఠశాల విధులకు వస్తున్నారో, లేదో పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎంఈవోలపైనే ఉంది. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తూ విద్యార్థుల ప్రగతి చదువులో వెనుకబడిన విద్యార్థుల సంఖ్యను పాఠశాలల వారిగా సమీక్షించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహించే గురుతర బాధ్యత కూడా ఎంఈవోలకు ఉంటుంది. మండలస్థాయిలో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత ఎంఈవోలకు ఉంటుంది. ప్రతీ ఏటా విద్యా సంవత్సరం ఆరంభంలో పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీతో పాటు మధ్యాహ్న భోజన వడ్డన తీరును పరిశీలించాల్సి ఉంటుంది. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల వేతన బిల్లులు, పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన బిల్లులను తయారు చేసి వారికి చెల్లించే బాధ్యతలు కూడా ఎంఈవోలపైనే ఉంటుంది. ఉన్నతాధికారులు ఎంఈవోలు పనిచేసే ప్రాంతాలకు వచ్చిన సందర్భంలో జవాబుదారిగా ఉంటూ పాఠశాలలను సందర్శించడం రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించడం వంటి కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది.

‘మిషన్ భగీరథ’లో కలెక్టర్ పనితీరు భేష్

☞ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు సీఎస్ ఎస్‌పీ సింగ్ కితాబు
☞ వీడియో కాన్ఫరెన్స్‌లో అభినందనలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

వరంగల్ రూరల్ : మిషన్ భగీరథ పనుల్లో పురోగతికి జిల్లా కలెక్టర్ చూపిస్తున్న అంకితభావానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ సింగ్ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను అభినందించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ సురక్షిత నీటిని నల్లాల ద్వారా అందించే క్రమంలో ఓహెచ్ఎస్ఆర్‌ల నిర్మాణం, ఇంట్రా విలేజ్ పైప్‌లైన్ నిర్మాణం, తదితర విషయంలో కలెక్టర్ మంచి శ్రద్ధ కనబరిచి ప్రగతి సాధించారని అభినందించారు. హరితహారం కార్యక్రమం గురించి ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు నీటి సరఫరా, ట్రీ గార్డ్స్ ఏర్పాటు, హరిత బ్రిగేడ్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వందశాతం జియోట్యాగింగ్ చేయాలని ఆయన ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఆదేశించారు. మునిసిపల్ ప్రాంతాల్లో స్మృతి వనాల ఏర్పాటుపై తీసుకుంటున్న చర్యలను మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

హ్యాండ్‌లూమ్స్ డైరెక్టర్ శైలజ అయ్యర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 20 నుంచి ప్రారంభం కానున్న బతుకమ్మ పండుగ సందర్భంగా ఆహారభద్రత కార్డులున్న మహిళలందరికీ ప్రభుత్వం నుంచి చేనేత చీరలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాల వారీగా అందుకు నిల్వ చేసుకోవడానికి గోదాంలను గుర్తించాలన్నారు. చీరల పంపిణీ సవ్యంగా జరగడానికి నోడల్ ఆఫీసర్లను నియమించుకోవాలన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో కోటి 10 లక్షల మొక్కలను నాటడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఇప్పటికే 60 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటామని తెలిపారు. జిల్లాలో 46 శాతం మొక్కల జియోట్యాగింగ్ పూర్తి అయిందని తెలిపారు. జిల్లాలో మిషన్ భగీరథ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిషన్ భగీరథ ఇంట్రా విలేజ్ పనుల్లో భాగంగా గ్రామాల్లో 499 ఓహెచ్ఎస్ఆర్ (ఓహెచ్ఎస్ఆర్) నిర్మించాల్సి ఉండగా పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని తెలిపారు.

హరితహారంలో అందరూ భాగస్వాములు కావాలి

డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి



మొక్కను నాటుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

గీసుగొండ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారంలో ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతతో భాగస్వాములై మొక్కలను నాటి రక్షించాలని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని శాయంపేట శివారులో టెక్స్‌టైల్‌పార్కు కోసం సేకరించిన స్థలంలో ఆయన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి మంగళవారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టెక్స్‌టైల్‌పార్కు ఏర్పాటుతో లక్ష మందికి ఉపాధి లభిస్తుందన్నారు. టెక్స్‌టైల్ పార్కులో మొక్కలు నాటే సమయంలో వర్షం పడటం శుభసూచకమన్నారు. నాటిన మొక్కలను రక్షించే బాధ్యతను స్థానిక ప్రజాప్రతినిధులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, సీపీ సుధీర్‌బాబు, జాయింట్ కలెక్టర్ హరిత, టీఎస్‌ఐసీ డీఈ రామ్‌దాస్, ఆర్డీవో మహేందర్‌జీ, అటవీశాఖ సీఎఫ్‌వో అంజద్, డీఎఫ్‌వో పురుషోత్తం, ఎంపీపీ ముంత కళావతి, జడ్పీటీసీ అంగోతు కవిత, సర్పంచ్ కొంగర చంద్రమౌళి, ఎంపీడీవో సాయిచరణ్, తహసీల్దార్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కక్కెర్ల శ్రీనివాస్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోలీస్ ధర్మారావు, నాయకులు రాజయ్య, పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఊరుగొండలో...

దామెర : మండలంలోని ఊరుగొండ శివారులో మంగళవారం హరితహారంలో భాగంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని, నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, ఎన్ఎస్ఆర్ సంస్థల చైర్మన్ నాయినేని సంపత్‌రావు, డైరెక్టర్స్ స్వామిరావు, కళింగరావు, డాక్టర్ నిభితనాగేశ్వర్‌రావు, దామెర, ఆత్మకూరు మండలాల టీఆర్ఎస్ అధ్యక్షులు జాకీర్‌అలీ, సంపత్‌కుమార్, రామకృష్ణ గౌడ్, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రవీందర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లో టాస్క్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యేల వినతి

వరంగల్ అర్బన్ ఎడ్యుకేషన్ : ఎడ్యుకేషన్ హబ్‌గా విస్తరిస్తున్న వరంగల్ నగరంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టీఏఎస్‌కే- టాస్క్) సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను కోరారు. ఎమ్మెల్యేలు మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి కేటీఆర్‌ను కలిసి టాస్క్ సెంటర్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న పలు విషయాలను ఆయనకు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలతో పాటు నిట్, పలు వృత్తివిద్యా కళాశాలలుండటంతో సంవత్సరానికి సుమారు 30 నుంచి 40 వేల మంది విద్యార్థులు పట్టభద్రులై హైదరాబాద్‌లోని పలు కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారని మంత్రికి వివరించారు. వరంగల్‌లో టాస్క్ సెంటర్ ఏర్పాటుతో పలువురు పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చన్నారు. టాస్క్ సీఈవోతో మాట్లాడి వరంగల్‌లో టాస్క్ సెంటర్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యేలు కోరారు.

డబుల్ బెడ్‌రూంలు తమకే ఇవ్వాలి

➡ అడ్డుకుంటే అంతుచూస్తాం

➡ జాతీయ రహదారిపై

లబ్ధిదారుల రాస్తారోకో



గూడెప్పాడ్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న లబ్ధిదారులు

ఆత్మకూరు : మాకు కేటాయించిన డబుల్‌బెడ్‌రూంలు మాకే ఇవ్వాలి అడ్డుకుంటే.. అంతుచూస్తామంటూ లబ్ధిదారులు జాతీయ రహదారి పై రాస్తారోకో నిర్వహించారు. మంగళవారం ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ సెంటర్ జాతీయ రహదారిపై డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రాస్తారోకో చేయడంతో వరంగల్ నుంచి భూపాలపల్లి, ఏటూర్‌నాగారం వైపు వెళ్లే పలు వాహనాలు నిలిచిపోయాయి. కాంగ్రెస్, టీడీపీ డౌన్ డౌన్... జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. మాకు కేటాయించిన డబుల్‌బెడ్‌రూంలు మాకే ఇవ్వాలి... అడ్డు వస్తే అంతుచూస్తాం... అంటూ లబ్ధిదారులు, జాతీయ రహదారిపైన నినాదాలు చేశారు. కాంగ్రెస్.. టీడీపీ నాయకులను గ్రామాల్లోనికి రాకుండా అడ్డుకుంటామన్నారు. రాస్తారోకో వల్ల రోడ్డు కిరువైపుల ట్రాఫిక్ జామ్‌కావడంతో ఆత్మకూరు సీ.ఐ పీ.శ్రీనివాస్, ఎస్సైలు విఠల్, రవీందర్‌లు ఆందోళనకారులను శాంతింపజేశారు. అనంతరం టీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కాంతాల కేశవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల స్థలాలను 1976-1977వ సంవత్సరంలో కేటాయించిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇళ్లను నిర్మించుకోలేదన్నారు. ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం పథకం కింద కట్టించి ఇస్తున్నారు. రాజకీయ అవగాహన లేని టీడీపీ జిల్లా కన్వీనర్ గన్నోజు శ్రీనివాసాచారి తప్పుడు ప్రచారం చేస్తున్నాడని కాంతాల కేశవరెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగానే నేటి వరకు నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులతో అవస్థలు పడుతున్న విషయాని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ దగ్గరకు తీసుకెళ్లారని అన్నారు. ఈ ధర్నాలో టీఆర్‌ఎస్ జిల్లా నాయకులు సాంబయ్యగౌడ్, రాజుగౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ఎరికి భాగ్యమ్మ, పరికి సరోజన, ఎరుకల సాంబ, పరికి మమత, ఎలగటి మమత, పరికిరాజు, కొత్తురు రజీమాన్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన లబ్ధిదారులు..

గ్రామసభలో ఎంపిక చేసిన అభ్యర్థులకే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని కోరారు. మాకు కేటాయించిన గృహాలు మాకే ఇవ్వాలని వారు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్‌ను కలుస్తామని అబ్ధిదారులు తెలిపారు.

మా డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం సంగతేంటి..?

● కలెక్టరేట్‌కు తరలి వచ్చిన గూడెప్పాడ్‌కు చెందిన లబ్ధిదారులు

● వెంటనే ఇళ్లను నిర్మించాలని కలెక్టర్, జేసీ, ఆర్డీవోకు వినతి

వరంగల్ రూరల్: ప్రభుత్వం తమకు డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ స్థలంలో నెల రోజుల క్రితం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిందని అయితే రెండు నెలలు కావస్తున్నా తట్టెడు మట్టి తీయలేదని లబ్ధిదారులు వాపోయారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, జేసీ హరిత, ఆర్డీవో మహేందర్‌జీలను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. గూడెప్పాడ్ గ్రామంలో 832 సర్వే నెంబర్‌లోని రెండు ఎకరాల భూమిలో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిలు డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం శంకుస్థాపన చేశారని ఆ భూమిలో కొంత మంది నాలుగైదు ఇళ్లను నిర్మించుకొని ఖాళీగా ఉన్న భూమి కూడా ప్రభుత్వం 30 ఏళ్ల క్రితం మాకే ఇచ్చిందని ఈ భూమిలో డబుల్ బెడ్ రూం ఇళ్లను ఎలా నిర్మిస్తారని అడ్డుపడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ స్పందించి డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల పనులను మొదలు పెట్టాలని అన్నారు. లేకుంటే డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం జరిగేంత వరకు ఆందోళనలు చేస్తామని వారు తెలిపారు.

మతి స్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

దుగ్గొండి: మండలంలోని ముద్దునూర్ గ్రామానికి చెందిన గురిమళ్ల ప్రవీన్‌కుమార్ (29) మతిస్థిమితం లేని యువకుడు మంగళవారం తెల్లవారుజామున క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై భాస్కర్‌రెడ్డి కథనం ప్రకారం.. ప్రవీన్‌కుమార్ కొంత కాలంగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేసేవాడు. ఆరు నెలలుగా ఉద్యోగం మానేసి స్వగ్రామమైన ముద్దునూర్‌లో ఉంటున్నాడు. ఆతడి మానసిక పరిస్థితి సరిగా లేదు. నెల రోజుల కిందట నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రత్నించగా కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స చేయించి రక్షించారు. మంగళవారం తెల్లవారు జామున క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపారు. మృతుడికి వివాహము కాలేదు. మృతిడి తండ్రి దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

దామెర : మండలంలోని ఊరుగొండకు చెందిన మేకల రవీందర్ కుమారుడు శివకుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ధర్మారెడ్డి చొరవతో సీఎం ఆర్‌ఎఫ్ మంజూరు కోసం విజ్ఞప్తి చేశారు. ముందస్తుగా చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 2లక్షలు మంజూరయ్యాయి. మంగళవారం ఊరుగొండలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మారెడ్డి చేతుల మీదుగా బాధితుడు శివకుమార్ తండ్రి రవీందర్‌కు చెక్కును అందచేశారు. కార్యక్రమంలో ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు, జాకీర్‌అలీ, సంపత్‌కుమార్, ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ రామకృష్ణగౌడ్, డైరెక్టర్ రఘుపతిరెడ్డి, రవీందర్, వెంకటరెడ్డి, మధుకర్, సత్యనారాయణరెడ్డి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



పునాదుల్లోనే నిలిచిపోయిన వంటశాల నిర్మాణం



శిథిలావస్థలో తరగతి గదులు

దామెర ప్రాథమిక స్కూల్లో సమస్యల తిష్ట

మరుగుదొడ్లు, మూత్రశాలల కరువు

వంటగదుల నిర్మాణాల ఊసేలేదు

శిథిలావస్థలో తరగతి గదులు

ఆట వస్తువులు సమకూర్చడంలో నిర్లక్ష్యం

● దామెర

ప్రభుత్వం'కేజీ టు పీజీ' ఉచిత విద్య అందించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. అయితే ఇందుకు భిన్నంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సమస్యలు దర్శనమిస్తున్నాయి. దామెర మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న అనేక సమస్యలు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలల ఏర్పాటు లేదు. అంతే కాకుండా ఉపాధ్యాయులు సైతం టాయిలెట్‌కు వెళ్లాలంటే ఒకింత ఇబ్బందులు ఎదుర్కొవాల్సిందే మరి.

ఘణనీయంగా విద్యార్థుల సంఖ్య...

దామెర మండలంలోనే ఏ గ్రామంలోనూ లేనంతగా మండల కేద్రంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఘణనీయంగా నమోదైంది. మొత్తం విద్యార్థు ల సంఖ్య (40+183) 223 ఉంది. కాగా ఇందులో బాలికలు 96మంది, బాలురు 127మంది నమోదయ్యారు. అయితే వారికి సరిపడా వసతులు కల్పించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

శిథిలావస్థలో తరగతి గదులు...

విద్యార్థులకు తగినన్ని తరగతి గదులు లేవు. ఏళ్లనాడు నిర్మించిన తరగతి గదులే దిక్కు. ఇప్పటికీ వాటినే వినియోగిస్తుండడం తో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనలకు గురవుతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని జంకుతున్నారు.

మూణ్ణెలలైనా వంటగది నిర్మాణంలో కదలిక లేనేలేదు...

పాఠశాలలోని విద్యార్థుల సౌకర్యార్థం వంటగది నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కాగా వంటగది నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా రూ.2.50లక్షల బడ్జెట్‌తో నిర్మాణం చేసేందుకు గానూ మే 1న భూమిపూజ సైతం లాంఛనంగా పూర్తి చేశారు. అది కాస్తా పునాదుల్లోనే ఆగిపోయింది.

తరగతి గది నిర్మాణానికి అనుమతులు వచ్చాయి : ఎంఈవో సారయ్య



అదనపు తరగతి గది నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. అదే విధంగా వంట గది నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేస్తాం. విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, మూత్రశాలలను మెరుగు పరుస్తాం. పాఠశాలలో సదుపాయాల కోసం నిధులుమంజూరు చేయవలసినదిగా ప్రతిపాదనలు పంపించాం.

మినీ లోకం



మీ పార్టీకే ఓటేశాం..
సాక్ష్యంగా ఒక సెల్ఫీ కూడా
తీసుకుంటారా 'సర్!

కస్తూర్బా గురుకులంలో ఉచిత వైద్య శిబిరం

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకులంలో మంగళవారం లయన్స్ క్లబ్ నర్సంపేట వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంను నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అలాగే డాక్టర్ ఎమ్. నవత పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రతపై సలహాలను అందించారు.

కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మట్ట భరత్‌రెడ్డి, ఎంఈవో పర్వేజ్, మోతె ఇంద్రసేనారెడ్డి, ప్రిన్సిపాల్ రజినీ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకులు

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

నర్సంపేట టౌన్: కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని సీఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. నర్సంపేటలోని సంఘం కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు చుక్కయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం రూపొందించిన చట్టాలు సక్రమంగా అమలు కాకపోవడం వల్ల కార్మికులు అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి కీలక నిర్ణయాలలో కేంద్ర ప్రభుత్వానికి మద్దతు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీ పై న్యాయ పోరాటం చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలోని కార్మికులు, ఉద్యోగస్థుల హక్కులను ప్రభుత్వం హరించకుండా, వారికి సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి నక్క చిరంజీవి, కోశాధికారి అనంతగిరి రవి, ఉపాధ్యక్షుడు హన్మకొండ సంజీవ, నారాయణ, కొంరయ్య, సారంగం, వెంకన్న, మల్లేష్, బొమ్మకంటి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చేపల పెంపకం

ఐటీడీఏ పీవో చక్రధర్‌రావు



నల్లబెల్లి మండలం ఎర్రాయచెరువులో దంబూషియా చేపలను చల్లుతున్న చక్రధర్‌రావు

నల్లబెల్లి: దోమల నిర్మూలనకు చెరువులో దంబూషియా చేపల పెంపకాన్ని చేపట్టినట్లు ఐటీడీవో పీవో చక్రధర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని గోవిందాపురం శివారు ఎర్రాయచెరువులో ఆయన జడ్పీ వైస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్‌తో కలిసి దంబూషీయా చేప విత్తనాలను చల్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో దోమలు ఉత్పత్తి కాకుండా చేపలు నివారిస్తాయని అన్నారు. ఈ చేపలతో కి.మీ. పరిధిలో దోమలు ఉత్పత్తి కావని ఆయన చెప్పారు. ప్రతీ గ్రామంలోని చెరువులకు చేప విత్తనాలను అందచేస్తామని అన్నారు. హక్కు పత్రాలు కలిగిన పోడు భూములను వారి వారసులకు మార్చడానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. అలాగే హక్కుదారులకు విద్యుత్తు సరఫరా చేయడానికి అటవీ శాఖ నుంచి అభ్యంతరాలు లేకుండా చూస్తానని ఆయన తెలిపారు. అన్ని గ్రామాలకు దోమ తెరలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో డీఎంవో పైడిరాజు, ఎంపీపీ భానోతు సారంగపాణి, వైస్‌ఎంపీపీ పాలేపు రాజేశ్వర్‌రావు, సర్పంచ్ లక్ష్మన్‌నాయక్, తహసీల్దార్ రాజేంద్రనాధ్, ఎంపీడీవో మూర్తిరెడ్డి, కిషన్‌రావు, రమేష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షుడు సామల అశోక్

ఖానాపురం: వీఆర్వోల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సామల అశోక్ అన్నారు. మంగళవారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నర్సయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వో కార్యాలయ భవనాల నిర్మాణం చేపట్టి ఫర్నిచర్, స్టేషనరీ సమకూర్చాలి, డిజిటల్ లాగిన్ ఇవ్వాలి, అధికారిక విధులలో అవుతున్న ఖర్చులను ప్రభుత్వమే భరించాలి, ఇళ్ల స్థలాలు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌టీఏ నెలకు రూ.3వేలు మంజూరి చేయాలని అన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు భిక్షపతి, శ్రవన్ తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్

నల్లబెల్లిలో..

నల్లబెల్లి: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఆర్వోలు మంగళవారం స్థానిక తహసీల్దార్ రాజేంద్రనాధ్‌కు వినతి పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో డీటీ. మురళీధర్, సదయ్య, రాజేంద్ర ప్రసాద్, సదానందం, రవిందర్, అయిలయ్య పాల్గొన్నారు.

నెక్కొండలో..

నెక్కొండ: వీఆర్వోల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ విశ్వనారాయణకు వీఆర్వోల సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడు రవీందర్‌రావు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం చేసేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, జిల్లా కార్యదర్శి సంపత్, వీఆర్వోలు రమేష్, మధుసూదన్, అంజనేయులు, యాకయ్య పాల్గొన్నారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి: వీఆర్వోల సమస్యలు తీర్చాలని డిమాండ్ చే స్తూ మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ పున్నం చందర్ ద్వారా వీఆర్వోల సంఘ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వోలు జిల్లా కోశాధికారి కృష్ణమూర్తి, మండల బాధ్యులు నర్సింహస్వామి, సునిత, కొమురయ్య, తిరుపతిలు పాల్గొన్నారు.

గోల్కొండ మహేందర్ కుటుంబానికి న్యాయం చేయాలి

పర్వతగిరి: శాయంపేట మండలంలోని తహరాపూర్ వీఆర్వో గోల్కొండ మహేందర్ మృతిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జన్ను నర్సయ్య ఒక ప్రకటనలో కోరారు. వీఆర్వో మృతి కారకులైన రెవెన్యూ సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వెంకటేశ్వరాలయంలో స్వామి వారి కల్యాణం

నర్సంపేట టౌన్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని నర్సంపేట పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలను అర్చకులు వేద మంత్రోచ్చరణలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్మోహన్‌రెడ్డి, ఊర్మిళ, ప్రముఖ వ్యాపారవేత్తలు వేంశెట్టి శ్రీనివాస్, సత్యనారాయణతో పాటు పలువురు ప్రముఖుల దంపతులచే కల్యాణోత్సవ పూజలను అర్చకులు ముడుంబై మాధవాచార్యులు నిర్వహించారు.

పీహెచ్‌డీ పట్టా గ్రహీతకు సన్మానం

నర్సంపేట : ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ సభలో పాల్గొని పీహెచ్‌డీ పట్టాను పొందిన నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని హిందీ అధ్యాపకురాలు టి. అరుణ కుమారిని మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రమౌళితో పాటు అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు నవీన్, ఈ. సత్యనారాయణ, కె. సత్యనారాయణ, సుజాత, పార్వతి, సూర్యారావు, గజానన్, నరేందర్, శ్రీనివాసరావు, శంకర్, దేవేందర్ పాల్గొన్నారు.

సర్వశిక్షా అభియాన్ జేఏసీ కమిటీ ఏర్పాటు

చెన్నారావుపేట: తెలంగాణ సర్వశిక్షా అభియాన్ మండల జేఏసీ కమిటీ నూతన అధ్యక్షుడిగా భూక్యా స్వామి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా నర్మెట్ట యాదగిరి, కోశాధిగారిగా వరికోలు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా ముదురుకోళ్ల సంపత్, పబ్బోజు శ్రీనివాసచారిలు ఎన్నికయ్యారు. కందిక శిల్ప, అల్లం స్వప్న, చాందవతి హేమలతలను కమిటీ సభ్యులుగా ఎన్నికున్నారు. కమిటీ నిర్వహణ బాధ్యతలను జీ. బాలు, మంద అశోక్‌లకు అప్పగించారు.

'టీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు తరలి రావాలి'



నెక్కొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

నెక్కొండ: ఈ నెల 10న కరీంనగర్ జిల్లా పోచంపల్లిలో నిర్వహించే భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరు కానున్న సభకు మండల ముఖ్య నాయకులు పార్టీ శ్రేణులను తరలించాలన్నారు.

400 కోట్లతో ఎస్సారెస్పీ కాలువల పునరుద్ధరణ

పూర్వ కరీంనగర్, వరంగల్ జిల్లాలకు ఏకైక నీటి వనరుగా నిలుస్తున్న ఎస్సారెస్పీ కాలువ పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.400 కోట్లు ఖర్చు చేస్తుందని ఎంపీపీ అన్నారు. ఈ పునరుద్ధరణ పనులతో నెక్కొండ మండలంకు రెండు పంటలకు సరిపడా నీరందుతుందన్నారు. గత ఏడాదిలో ఎస్సారెస్పీ కాలువల ద్వారా మండలంలో సుమారు 12 చెరువులను నింపిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ దొనికెణ సారంగపాణి, రామాలయ కమిటీ చైర్మన్ గన్ను కృష్ణ, మెండె కుమారస్వామి, యాకు, నంద నాయక్, వాగ్యా నాయక్, శివకుమార్, మాణిక్యం, సాంబయ్య, శ్రీకాంత్, రఫీ, పాషా పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

ఖానాపురం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ.6.30లక్షల సీబీఎఫ్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, జడ్పీటీసీ ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి, సర్పంచ్ తక్కళ్లపల్లి రమేష్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బోడ పూలు ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, వైద్య సిబ్బంది శ్యాం, భాస్కర్ పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

'రుణాలివ్వాలి'

నెక్కొండ: ప్రభుత్వం అందించే ఎస్సీ కార్పోరేషన్ రుణాల్లో నిరుద్యోగ యువతకు ప్రైవేటు ఎలక్ట్రీషన్, వృత్తి శిక్షణ పొందిన ఎస్సీలకు అవకాశం కల్పించాలని మండల తెలంగాణ ప్రైవేటు ఎలక్ట్రీషన్ సంఘం అధ్యక్షుడు ఈ. మహేష్ డిమాండ్ చేశారు.

అనాథ వృద్ధులకు ఆర్థిక సహాయం

దుగ్గొండి: మండలంలోని రేకంపల్లి ఉప సర్పంచ్ ఉమా రవిందర్ అనాథ వృద్ధులకు ఐదు వేలు ఆర్థిక సహాయంగా బాలవికాస స్వచ్ఛంద సంస్థకు మంగళవారం అందించారు. బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలలో 80 మంది వృద్ధులకు ఆర్థిక సహాయం అందించుటకు విరాళాలు సేకరించగా ఉమారవిందర్ సంస్థ ప్రతినిధి గొర్కటి రాజ్‌కుమార్‌కు విరాళం చేశారు. ఈసందర్భంగా రాజ్‌కుమార్, ఉమా రవిందర్‌ను అభినందించారు.

15న రక్తదాన శిబిరం

పర్వతగిరి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15న రామకృష్ణ సేవా సమితి, ఆర్డీఎఫ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ప్రతినిధులు కందగట్ల రమేష్, జనార్దన్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కల్లెడ గ్రామంలోని ఆర్డీఎఫ్ పాఠశాల ఆవరణలో నిర్వహించే రక్తదాన శిబిరానికి యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీధర్, శ్రీనివాస్, మల్లికార్జున్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా హరితహారం


నల్లబెల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఏసీపీ

నర్సంపేట: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటు పడాలని నర్సంపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ భరత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఇప్పల్ తండాలో మంగళవారం క్లబ్ ఆధ్వర్యంలో హరితహారంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ర్యాలీని నిర్వహించారు. ఫ్లోరోసిస్ కారణంగా దంత సమస్యలతో బాధపడే వారికి ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్లు రాజేశ్వర్‌రావు, లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, చింతల నిరంజన్, ప్రసాద్, భాస్కర్, ముత్తోజిపేట సర్పంచ్ మండ మహేందర్, తండా వాసులు పాల్గొన్నారు.

నల్లబెల్లిలో..

నల్లబెల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో హరితహారంలో భాగంగా మంగళవారం ఏసీపీ మురళీధర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సిఐ బోనాల కిషన్, ఎస్సై రాజమౌళితో పాటు పోలీస్ సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బల్వంతాపురంలో..

దుగ్గొండి: దుగ్గొండి మండలంలోని బల్వంతాపురం గ్రామంలో మంగళవారం హరితహారంలో భాగంగా ఎస్సై భాస్కర్‌రెడ్డి మొక్కలను నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభ, పీసీలు విజేందర్, దేవేందర్ పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో..

వర్ధన్నపేట : మానవ మనుగడకు మొక్కలు నాటాలని వర్ధన్నపేట సర్పంచ్ గాడిపెల్లి స్వరూప రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ట్రాక్టర్‌లో నిమ్మ మొక్కలు ఇంటింటా పంపిణీ చేశారు. అలాగే నాటిన మొక్కలను సంరక్షించి భావి తరాలకు బంగారు బాటలువేయాలని వర్ధన్నపేట సిఐ ఆదినారాయణ, ఎస్సై సందీప్‌లు కోరారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో మొక్కలు నాటారు.

పర్వతగిరిలో..

పర్వతగిరి: హరితహారం కార్యక్రమంలో మొక్కలను నాటడమే కాదని, నాటిన మొక్కలను సంరక్షించాలని జిల్లా సహకార అధికారి పద్మ అన్నారు. మంగళవారం మండలంలోని చౌటపెల్లి పీఏసీఎస్ పరిధిలోని ఏనుగల్లు గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ గంధం బాలరాజుతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో చైర్మన్ గంధం బాలరాజు, సీఈవో మల్లయ్య, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నెక్కొండలో..

నెక్కొండ: హరితహారం పథకాన్ని విజయవంతం చేయుటకు గాను మంగళవారం మండలంలోని గేటుపల్లి గ్రామంలో పోలీసులు భారీ వర్షాన్ని లెక్కచేయకుండా మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయన్న, పోలీసులు సాయన్న, బిడ్డర్ శ్రీనివాస్, మధు, సీతరామరాజు, రాజు, రామకృష్ణ, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో హరితహారంలో భాగంగా పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మండలంలో లింగాపురం, కోనాపురం గ్రామాల్లో 5వేల మామిడి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసుల శోభతిరుమల్, మిట్టపెల్లి రమ, ఎంపీటీసీ రాములు, నారాయనరెడ్డి, బాబురావు పాల్గొన్నారు.

'నాన్చివేత ధోరణి విడనాడాలి'


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వర్ధన్నపేట : ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం నాన్చివేత ధోరణిని విడనాడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండేటి సారంగపాణి మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ 1965లో కేంద్రం నియమించిన లోకూర్ కమిషన్, ఇటీవల ఉషామెహ్రా కమిషన్ సిఫారసులు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత పార్లమెంట్‌లో సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఈరెల్లి శ్రీనివాస్, ఆర్. ఆరోగ్యం, కొండేటి మహేష్, కొండేటి అనిల్, ప్రభాకర్, రడపాక యాకయ్య పాల్గొన్నారు.

'పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి'

వర్ధన్నపేట : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విదానాన్ని పునరుద్ధరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీమళ్ల సారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 1.20 లక్షల మంది ఉపాధ్యాయ ఉద్యోగుల కుటుంబాల భద్రతను అగమ్యగోచరంగా చేస్తూ ఆందోళనకు చేస్తున్న సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే పునరుద్ధరించాలన్నారు. ఈనెల 9న (నేడు) వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘాల నాయకులు శ్రీనివాస్, లింగమూర్తి, రవీందర్, వేణు పాల్గొన్నారు.

నల్లబెల్లిలో..

నల్లబెల్లి: సీపీఎస్ పథకాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో ఈనెల 10న, స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కరపత్రాలను కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కందుల గోవర్ధన్, పాలకుర్తి చంద్రయ్య, మోకల రాజు, సదాశివుడు, నరేందర్, రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, రజిత పాల్గొన్నారు.

'సొసైటీలో జరిగిన అవినీతిపై పోరాటం చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న వల్లెపు ఉపేందర్‌రెడ్డి

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని సొసైటీలో జరుగుతున్న అవినీతిపై పోరాటం చేయాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లెపు ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చెన్నారావుపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో జరిగిన అవినీతిపై రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. విచారణ చేసిన అధికారులు చైర్మన్ సాంబరెడ్డిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాజకీయాలకతీతంగా అవినీతి, అక్రమాలపై పోరాటం చేయడానికి పోరాట కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పత్తి అనంతరెడ్డి కార్యదర్శిగా 11మందితో కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కంది రాజిరెడ్డి, ఎమ్డీ. మాషుక్, పరకాల కొంరయ్య, జన్ను సమ్మయ్య పాల్గొన్నారు.

'సాగునీటికి ప్రభుత్వం ప్రాధాన్యత'

నల్లబెల్లి: ప్రభుత్వం బంగారు తెలంగాణలో భాగంగా సాగునీటి రంగానికి ప్రాధాన్యత కల్పిస్తున్నదని టీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు ఉడ్డుల ప్రవీణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సాగునీరందించే అతిపెద్ద శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పూడుకపోయి నీరందని పరిస్థితి ఏర్పడిందన్నారు. సీఎం ప్రభుత్వం ప్రాజెక్ట్ పునరుజ్జీవం కల్పించేందుకు భారీ గా నిధులను మంజూరు చేశారన్నారు. ఈనెల 10న పోచంపాడ్‌లో సీఎం చేతుల మీదుగా నిర్వహించే శంకుస్థాపన కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. మండలం నుంచి 15 వాహనాలలో చలో పోచంపాడ్‌కు తరలివెలుతున్నట్లు ఆయన చెప్పారు. ఈసమావేశంలో ఎంపీపీ సారంగపాణి, వైస్‌ఎంపీపీ రాజేశ్వర్‌రావు, సర్పంచ్‌లు చేరాలుగౌడ్, వెంకన్న, శివాజీ, శ్రీనివాస్, రాజు, మన్మోహన్‌రెడ్డి, హన్మంతు, నరహరి, జైపాల్‌రెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారుడికి సన్మానం

దుగ్గొండి: జాతీయ స్థాయిలో జరిగిన ఖో ఖో క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపి బంగారు పతకం సాధించిన పాల్‌టెక్నిక్ మూడవ సంవత్సరం చదువుచున్న విద్యార్థి దారావతు రాజ్‌కుమార్‌ను మంగళవారం ఎస్సై భాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఊరటి మహిపాల్‌రెడ్డిలు సన్మానించారు. మండలలోని వెంకటాపురం శివారు మంగళితండకు చెందిన దారవతు లింగులు, కమల దంపతుల కుమారుడు దారవతు రాజ్‌కుమార్ అండర్ 19 ఏళ్ల విభాగంలో రాష్ట్రం తరుపున గత నెల 30, 31 తేదిలలో ఉత్తరప్రదేశ్‌లోని మధుర పట్టణంలో జరిగిన జాతీయ స్థాయి విభాగంలో జరిగిన ఖోఖో క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటి బంగారు పతకం సాధించి అంతర్జాతీయ ఖోఖో క్రీడలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌ను ఎస్సై భాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఊరటి మహిపాల్‌రెడ్డిలు శాలువతో సన్మానించి అభినందించారు.


రాజ్ కుమార్‌ను సన్మానిస్తున్న ఎస్సై

రోడ్లను నాశనం చేస్తున్న కేజీ వీల్స్ ట్రాక్టర్స్

చెన్నారావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో కేజీ వీల్స్ ట్రాక్టర్లు రోడ్లను నాశనం చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్లపై కేజీ వీల్స్‌తో ట్రాక్టర్లు వెళ్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పలు చోట్ల రోడ్ల పక్కన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పలు గ్రామాల్లోని ట్రాక్టర్ యజమానులు పట్టించుకోకుండా రోడ్లపై కేజీవీల్స్‌తో వెళ్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాక్టర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఉప్పరపల్లిలో రోడ్డుపైన కేజీ వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్

'మాటలతో మభ్యపెడుతున్న ప్రభుత్వం'

వర్ధన్నపేట : ప్రభుత్వం మాటలతో మభ్యపెడుతూ ప్రజలను పక్కదారి పట్టిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వడిచర్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నారం గ్రామ కమిటీ ఎన్నిక సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలపై బురదజల్లడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం చెన్నారం గ్రామ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడుగా గుజ్జ రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా పెండ్యాల కరుణాకర్, కార్యదర్శిగా మంద నర్సయ్య, కోశాధికారిగా దొమ్మటి రాజు, సభ్యులుగా కలకోటి దేవేందర్, నాంపెల్లి యాకయ్య, తూళ్ల మహేష్, పాలకుర్తి రాములు, యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మడూరి రమేష్‌గౌడ్, మంద సంపత్ యాదవ్, అమరవాది మహేందర్, కోశాధికారిగా ఓనెల అఖిల్, సభ్యులుగా తాళ్లపెల్లి పూర్ణ, చెన్నూరి రాజు, మంద కుమారస్వామి, పాలకుర్తి యాకయ్యగౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టీఆర్ఎస్‌లో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

పర్వతగిరి: మండలంలోని కొంకపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రాయబారపు వివేక్ మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టీఆర్ఎస్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ గోపగాని రాజుగౌడ్, నాయకులు కరిమిల్ల మోహన్‌రావు, కొయ్యల రాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

పోచంపాడు సభను విజయవంతం చేయాలి..

పర్వతగిరి: ఈనెల 10వ తేదిన ఎస్సారెస్పీ పోచంపాడు సభను విజయవంతం చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోచంపాడులో నిర్వహించే సభకు అధిక సంఖ్యలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ యుగేంధర్ రావు, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రధన్‌రావు, మనోజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ పాస్ శిక్షణకు రేషన్ డీలర్లు హాజరు కావాలి

ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ధారావత్ మోహన్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్ నాయక్

నర్సంపేట టౌన్: హన్మకొండలోని రూరల్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 10, 11 తేదీల్లో జరుగనున్న ఈ పాస్ యంత్రాల శిక్షణా తరగతులకు జిల్లాలోని డీలర్లు సకాలంలో హాజరుకావాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ధారావత్ మోహన్ నాయక్ పిలుపునిచ్చారు. నర్సంపేటలోని వాసవి కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 45 రోజుల్లో డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ మేరకు డీలర్లందరూ ఈ పాస్‌యంత్రాలను తీసుకోవడానికి సంఘం రాష్ట్రకమిటీ నిర్ణయం మేరకు ఈపాస్ శిక్షణ తరగతులకు హాజరు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగర వాణి రామరాజ్, సామల మల్లయ్య, చెట్టుపెల్లి దామోదర్, అనంతుల రాజకళరాం నారాయణతో పాటు వివిధ మండలాల డీలర్లు పాల్గొన్నారు.

ఎంపీటీసీకి డిప్యూటీ సీఎం పరామర్శ



ఎంపీటీసీని పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చల్లా

సంగెం : మండలంలోని ఆశాలపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ దేశినేని యాదగిరిరావును రాష్ట్ర డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిలు పరామర్శించారు. మంగళవారం ఎంపీటీసీ స్వగ్రామమైన ఆశాలపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. యాదగిరిరావు తండ్రి చలపతి రావు ఇటీవల మృతి చెందారు. కడియం శ్రీహరి అనుచరుడిగా పేరున్న యాదగిరిరావును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సినిమాలు

● పరకాల
జయ డీలక్స్ : ఫిదా
కాకతీయ : గౌతమ్‌నంద
నటరాజ్ : నక్షత్రం

● నర్సంపేట
రాంరాజ్: : నక్షత్రం
జయశ్రీ : ఫిదా
అరవింద : గౌతమ్‌నంద

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సినీ, రాజకీయ, న్యాయ, ఉన్నత విద్యా రంగాల వారికి ఆర్థికంగా అనుకూలిస్తుంది. ప్రియతములకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. ప్రయాణాలు, చర్చలు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బంధు, మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ప్రదర్శనలు, సభలకు అనుకూలం. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల వైఖరి గురించి ఆలోచిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.



మిథునరాశి:(మే21-జూన్21): పెద్దలతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. వృత్తి, ఉద్యోగాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.



కర్కాటకరాశి:(జూన్22-జూలై23): వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. పెట్టుబడులకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు. సంకల్పం ఫలిస్తుంది.



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. మ్యూచ్యువల్ ఫండ్స్, బ్యాంకు లావాదేవీలు లాభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలపై స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. ఆత్మావలోకనం చేసుకునేందుకు తగిన సమయం.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సమావేశాలు, బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులతో అనుబంధం ఏర్పడుతుంది.భాగస్వామి గురించి ఆలోచిస్తారు. కొత్త పరిచయాలు లక్ష్య సాధనకు తోడ్పడతాయి.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బంధుమిత్రులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆస్పత్రులు సందర్శిస్తారు. వైద్యం, హోటల్, రిటైల్ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఆహార నియమాలు పాటిస్తారు.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ప్రముఖులతో వేడుకల్లో పాల్గొంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆర్థిక విషయాల్లో సంకల్పం నెరవేరుతుంది. చిట్‌ఫండ్‌లు, డిపాజిట్లపై మంచి ప్రతిఫలం అందుకుంటారు.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బంధుమిత్రుల కలయికతో ఇంట్లో సందడిగా ఉంటుంది. ఇంటికి అవసరమైన వస్తువుల రవాణాకు అనుకూలం. బదిలీల విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యం సాధిస్తారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిరకాల మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. సన్నిహితుల స్టేషనరీ, రవాణా, బోధన, ఏజెన్సీ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వామ్యాలు లాభిస్తాయి. స్నేహ పరిచయాల ఆధారంగా ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల కోసం విలువైన వస్తువుల కొనుగోలు చేస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): విందు, వినోదాలతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగ సంస్థలు, పరిశ్రమలు, వైద్య రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. కొత్త ప్రాజెక్టులు ప్రారంభానికి అనుకూల సమయం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

కదులుతున్న 'రేషన్' డొంక

ఇప్పటి వరకు 15లారీల బియ్యం తరలింపు

అధికారుల తనిఖీలతో వెలుగులోకి 'కొత్త' నిజాలు

తొర్రూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో రెండోరోజూ కొనసాగిన తనిఖీలు


తొర్రూరు సివిల్ సప్లయి గోదాంలో బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న ఓస్డీ రాజేశం

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా) : తీగలాగితే రేషన్ దందా డొంక కదులుతోంది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఎంఎల్ఎస్ పాయింట్ కేంద్రంగా జరిగిన రేషన్ దందాలో తోడిన కొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. అంతా కలసికట్టుగా వ్యవహారం సాగించినట్లు తెలుస్తోంది. పంపకాల్లో తేడా రావడం తోనే పంపిణీ బియ్యం తరలుతున్నాయంటూ అందులో కొంతమంది పోలీసులకు సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఈఘటనపై రాష్ట్ర సివిల్ సప్లయి టాస్క్‌ఫోర్స్ అధికారులు తొర్రూరు డివిజన్ కేంద్రం లో మంగళవారం రెండోరోజూ సివిల్ సప్లయి గోదాంలో తనిఖీలు నిర్వహించారు.

ఈసందర్భంగా రాష్ట్ర సివిల్ సప్లయి టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ బి.రాజేశం మాట్లాడుతూ మండలంలోని మాటేడు గ్రామంలో ఎస్.కృష్ణ పేరుతో మార్చి నెలలో సోమేశ్వర ట్రేడర్స్ రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ పొందిన అతను బిల్లులు, వే బిల్లులు పొంది ఇప్పటి వరకు 15లారీల బియ్యం ఇతర రాష్ట్రాలకు తరలించినట్లుగా ప్రాథమికంగా అంచనాకు రావడం జరిగిందన్నారు. మొత్తంగా 33,500 క్వింటాళ్లు విక్రయించినట్లుగా సమాచారం ఉందన్నారు. పూర్తిస్థాయిలో అవినీతిపై విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని పోలీస్‌స్టేషన్ నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తీసుకువచ్చి బియ్యాన్ని మళ్లీ గోదాంలో భద్రపరిచారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎం.వి. పద్మానాభరెడ్డి, ఎల్.లక్ష్మారెడ్డి, ఎస్.లక్ష్మణ్‌రావు, సివిల్ సప్లయి డీటీ నారాయణరెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రస్తుత సమావేశాల్లోనే
వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

రేపు అర్బన్ జిల్లా కలెక్టరేట్ ముట్టడి

ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లేష్ మాదిగ

వడ్డేపల్లి(హన్మకొండ): ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొయ్యడ మల్లేష్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం హన్మకొండ ఎన్జీవోస్ కాలనీలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పుట్ట రవి మాదిగ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదింపజేసేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు 10న వరంగల్ ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అర్బన్ జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నామని కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. బచ్చలికూర వెంకటేశ్వర్లు, కిలికపోగు వెంకటేశ్వర్లు, కల్లెపల్లి ప్రణయ్, ఆరెపల్లి పవన్, దామెర కరుణ, కొండేటి సారంగపాణి, మంద రాజు, జన్ను రవి, చంద్రమౌళి, గోవింద్ మొగిలి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొయ్యడ మల్లేష్ మాదిగ

అశ్వక దళం ఏర్పాటుతో కమిషనరేట్ స్థాయి పెంపు

అభివృద్ధి పనులను పరిశీలించిన వరంగల్ సీపీ సుధీర్‌బాబు


అశ్వకదళం అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

ఖిలావరంగల్: అశ్వకదళం (గుర్రపుశాల) అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలను పాటించి, పనులను వేగవంతం చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు అన్నారు. మంగళవారం ఖిలావరంగల్ కోటలో జరుగుతున్న అశ్వకశాల పనులను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ స్థాయిని పెంచే విధంగా అశ్వకదళాన్ని (గుర్రపుశాల) ను అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పది అశ్వక దళాన్ని నూతనంగా ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈ విభాగాన్ని పోలీస్ కమిషనరేట్‌కు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అలాగే వరంగల్‌తోపాటు, ఖిలావరంగల్ టూరిజాన్ని పెంపొందించే విధంగా నగరంలో ప్రత్యేక కార్యక్రమాల్లో అశ్వకదళాన్ని వినియోగిస్తామన్నారు. మూడు నెలల క్రితం పోలీస్ అదనపు డీజీపీ అంజన్‌కుమార్, కలెక్టర్ ఆమ్రపాలి చేతుల మీదుగా అశ్వకదళం పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో మిల్స్‌కాలనీ, ఇంతెజార్‌గంజ్ సీఐలు పుప్పాల తిరుమల్, రవికుమార్ పాల్గొన్నారు.

కాకతీయ కట్టడాలపై పుస్తక రచన

కేంద్ర పురావస్తుశాఖ తెలంగాణ సూపరింటెండెంట్ మిలన్‌కుమార్ చౌళి, అమెరికా ప్రొఫెసర్ ఫిలిప్

ఖిలావరంగల్ కోటలో కట్టడాలు, శిల్పాల పరిశీలన


మధ్యకోటలోని కాకతీయుల కట్టడాలను తిలకిస్తున్న కేంద్ర పురావస్తు శాఖ తెలంగాణ సూపరింటెండెంట్ మిలన్‌కుమార్, అమెరికా ప్రొఫెసర్ ఫిలిప్ బి వ్యాగనర్

ఖిలావరంగల్: కాకతీయుల కట్టడాలు, చరిత్రపై పుస్తకాన్ని రచించడానికి అమెరికా బోస్టన్‌లోని వెగ్గిన్ యూనివర్సిటీ పురావస్తు ప్రొఫెసర్ ఫిలిప్ బి వ్యాగనర్, కేంద్ర పురావస్తు శాఖ తెలంగాణ సూపరింటెండెంట్ మిలన్ కుమార్ చౌళి మంగళవారం మధ్యకోటలోని కాకతీయుల కాలంనాటి కట్టడాలు, శిల్పసంపదను పరిశీలించారు.


ఈ సందర్భంగా ఫిలిప్ బి వ్యాగనర్ మాట్లాడుతూ నల్లసేనపు రాతిపై కాకతీయుల కాలంలో నిర్మించిన కట్టడాలు, దేవాలయాలు, నిర్మాణాలు వేయిసంవత్సరాలుగా చెక్కు చెదరకుండా ఉన్నాయన్నారు. వారి కాలంలో చరిత్రకు సంబంధించిన విషయాలపై పుస్తకాన్ని రాయడానికి తాను వరంగల్‌కు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రపురావస్తు శాఖ తెలంగాణ సూపరింటెండెంట్ మిలన్‌కుమార్ చౌళి మాట్లాడుతూ పురాతన కాలంనాటి కట్టడాలు, నిర్మాణాలను పరిరక్షించి ముందుతరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వారు మధ్యకోటలోని శిల్పాల ఆవరణ, కీర్తితోరణాలు, కొండ మసీదు, ఖుష్‌మహల్, గుండుచెరువు, స్వయంభూ దేవాలయం, ఏకశిలగుట్ట, సత్తుబండ, నేలశంభునిగుడి, రాతి,మట్టి కోటలను తిలకించారు.

కార్యక్రమంలో కేంద్ర పురావస్తు శాఖ సీఏ ఎం.మల్లేశం, ఆర్కియాలజీ రిటైర్డ్ సూపరింటెండెంట్ డైరెక్టర్ రంగాచార్యులు, మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య, గైడ్ డి.రవి యాదవ్,సురేందర్‌కుమార్, గంగాధర్, అరవింద్, ఖిలా ఇన్‌చార్జి శ్రీకాంత్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు

తెలంగాణ చేనేత కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు

ఎస్ఆర్ఆర్ తోట మోడల్ చేనేత సహకార సంఘంలో జాతీయ చేనేత వారోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

కరీమాబాద్(వరంగల్) : చేనేత పరిరక్షణకు, కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ నగరంలోని 23వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోటలో మోడల్ చేనేత సహకార సంఘంలో జాతీయ చేనేత వారోత్సవాలను పురస్కరించుకుని చేనేత కార్మిక సంఘం నాయకుడు బైరి దయాసాగర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా వెంకట్రాములు హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల బడా పారిశ్రామికవేత్తల అనుకూల విధానాలతో చేనేత పరిశ్రమ సంక్షోభానికి గురై కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. కార్మికుల ఆకలి చావులు, ఆత్మహత్యల పరంపర కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేనేత ను జీఎస్‌టీలో చేర్చి పన్ను లు విధిస్తుండడంతో చేనేత పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయిందన్నారు. జీఎస్‌టీ నుంచి చేనేతను వెంటనే తొలగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుపరచడంలో విఫలమైందన్నారు. చేనేత ను జౌళి శాఖ నుంచి విడదీసి ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేసి రూ.500 కోట్ల నిధులు కేటాయించి, కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ కార్మికుడికి నెలకు రూ.15 వేల వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతీ కార్మికుడికి నెలకు రూ.3వేల పెన్షన్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు పునరుద్దరించి పూర్తి స్థాయిలో వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ అంత్యోదయ కార్డులను అందించాలన్నారు.

అనంతరం సీనియర్ వీవర్స్ కందగట్ల శంకర్, దుస్స లచ్చమ్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత కార్మిక సంఘం, మోడల్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు కోట రాజయ్య, కాముని అయిలయ్య, వేముల నారాయణ, ఆడెపు సంపత్ కుమార్, పెద్దూరి రమేష్, దూడెం నరేందర్, బిల్ల కేదారమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు మాని..

కేసీఆర్ భగీరథ ప్రయత్నానికి సహకరించండి

ప్రతిపక్షాలకు డిప్యూటీ సీఎం కడియం హితవు

రేపు పోచంపాడులో నిర్వహించే సభకు ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం

హన్మకొండ టౌన్: కోటి ఎకరాల మాగాణికి సాగునీరు అందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు పూనుకుని ముందుకు సాగుతుంటే ప్రతిపక్షాలు విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రశ్నించారు. విమర్శలు మానుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న భగీరథ ప్రయత్నానికి సహకరించాలని కడియం శ్రీహరి ప్రతిపక్షాలకు హితవు పలికారు. మంగళవారం హన్మకొండలోని టీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం శ్రీహరి మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు తెలంగాణలోని ప్రతి గ్రామీణ నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఆ హామీలను నిలబెట్టుకునేందుకు మూడు దశల్లో ప్రాజెక్టుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటి వరకు నిర్మాణమైన ప్రాజెక్టుల ఆధునీకరణ, నిర్మాణ దశలో ఉన్న వాటి రీడిజైనింగ్, కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయం తీసుకుని, ప్రతీ సంవత్సరం రూ.25వేల కోట్లు సాగునీటి పారుదల రంగానికి కేటాయించడం జరుగుతోందన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణాల్లో భాగంగా ఎస్ఆర్ఎస్పీ పునరుజ్జీవనం చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భగీరథ ప్రయత్నానికి పూనుకున్నట్లు కడియం తెలిపారు. 16లక్షల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంగా నిర్మాణమైన ఈ ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం 5లక్షల ఎకరాలకు నీరందడం లేదన్నారు. 112 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన ప్రాజెక్టు ప్రస్తుతం సిల్ట్ పేరుకుపోవడంతో 85 టీఎంసీలకు చేరుకుందన్నారు. ఎస్ఆర్ఎస్పీ పునరుజ్జీవనం చేయాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంతో తెలంగాణలోని ఆరు జిల్లాలకు (నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ) సాగు,తాగునీటి కష్టాలు తీరుతాయన్నారు. ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 1, స్టేజ్ 2, దేవాదుల ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 10 గ్రామీణ నియోజకవర్గాలకు ఒక్కో నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎస్ఆర్ఎస్పీ పునరుజ్జీవనానికి రూ.1091కోట్ల పరిపాలన మంజూరు ఇవ్వడం జరగిందన్నారు.

వరంగల్ జిల్లాకు పెద్ద రిజర్వాయర్ లేదని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం మల్కాపూర్‌లో 10 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. రూ.4వేల కోట్ల అంచనాతో నిర్మించబోయే రిజర్వాయర్ నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలువనున్నట్లు కడియం పేర్కొన్నారు. ఎస్ఆర్ఎస్పీ పునరుజ్జీవనానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 10 పోచంపాడు వద్ద 5లక్షల మందితో రైతు సభ నిర్వహించి కార్యచరణను ప్రకటించనున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ బృహత్తర కార్యక్రమానికి పార్టీలకతీతంగా సహకరించాలని సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ జలాలను ఆంధ్రాకు తరలించుకు వెళ్తుంటే ఎందుకు ప్రశ్నించలేదని ప్రతిపక్షాలను విమర్శించారు. బహిరంగ సభకు ప్రజలు, భారీగా తరలివచ్చి కేసీఆర్‌కు సంఘీభావం తెలుపాలని కడియం శ్రీహరి పిలుపునిచ్చారు.

సమావేశంలో టీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.రవిందర్‌రావు, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, మేయర్ నన్నపునేని నరేందర్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నేతలు చింతల యాదగిరి, జోరిక రమేశ్, కె.సుభాష్‌గౌడ్, రజనీకుమార్, లలితాయాదవ్, మాధవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన కడియం శ్రీహరికి ఈ సందర్భంగా పలువురు నేతలు పూల బోకేలు అందించి స్వాగతం పలికారు.

నేతలతో భేటీ..

10న పోచంపాడులో నిర్వహిస్తున్న రైతు సభకు సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో కడియం శ్రీహరి భేటీ అయ్యారు. తక్కళ్లపల్లి రవిందర్‌రావు గృహంలో భేటీ అయిన కడియం నియోజకవర్గాల వారీగా జనాల తరలింపునకు సంబంధించి టార్గెట్‌లు విధించినట్లు సమాచారం. మొత్తంగా ఉమ్మడి వరంగల్‌ను నుంచి పెద్ద ఎత్తున తరలించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

రేపటి వరకు కేయూ డిగ్రీ సప్లమెంటరీ పరీక్షల ఫీజు గడువు

కేయూక్యాంపస్(కాళోజీ జంక్షన్): కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం తదితర కోర్సుల సప్లమెంటరీ పరీక్ష ఫీజుల గడువును ఈనెల 10 వరకు పొడిగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.మహేందర్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎల్‌పీ రాజ్‌కుమార్ తెలిపారు. గతంలో ప్రకటించిన 5వ తేదీని 10 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. రూ.50 ఆపరాధ రుసుంతో 17 వరకు రూ . 250 అపరాధ రుసుంతో ఈనెల 23 వరకు పరీక్షల ఫీజులు చెల్లించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ ఫలితాల వెల్లడి

కాకతీయ యూనివర్సిటీ ఐదేళ్ల లా కోర్సు ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ ఫలితాలను కేయూ పరీక్షల నియంత్రణాధికారులు ప్రొఫెసర్ ఎస్.మహేందర్‌రెడ్డి, వి.రామచంద్రం మంగళవారం విడుదల చేశారు. గత మార్చిలోజరిగిన పరీక్షల్లో 36.7శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణులైనట్లు వారు పేర్కొన్నారు. వీరిలో మహిళ అభ్యర్థులు 54.17కాగా పురుషులు 9.09శాతం ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలను కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఎంబీఏ మొదటి సెమిస్టర్ ఫలితాలు..

కాకతీయ యూనివర్సిటీ ఎంబీఏ మొదటి సెమిస్టర్ ఫలితాలను మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారులు ఎస్.మహేందర్‌రెడ్డి, వి.రామచంద్రం విడుదల చేశారు. 56.61శాతం మంది అభ్యర్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులైనట్లు వారు పేర్కొన్నారు. వీరిలో 72.87 మహిళలు కాగా 44.99శాతం పురుషులు ఉన్నట్లు తెలిపారు. ఫలితాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

11నుంచి నిట్‌లో ఇంపాక్ట్ 2017

సుబేదారి(హన్మకొండ): ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11నుంచి 13వ తేదీ వరకు నిట్‌లో ఇంపాక్ట్ 2017 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇంపాక్ట్ నాయకులు తెలిపారు. హన్మకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మాత్రమే అర్హులని వారు తెలిపారు. సమావేశంలో గార్లపాటి శ్రీనివాసులు, రమేష్, అశోక్, పృథ్వీరాజ్, సీతారాం, ప్రకాశ్ పాల్గొన్నారు.

చైనా యూనివర్సిటీతో నిట్ ఒప్పందం

నిట్‌క్యాంపస్(కాజీపేట) : గత నెలలో బ్రిక్స్ దేశాల సదస్సులో పాల్గొన్న నిట్‌డైరెక్టర్ జీఆర్‌సీ రెడ్డి చైనాలోని జంగ్ జావ్‌లోని నెట్‌వర్క్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ చేపట్టిన బ్రిక్స్ ఒప్పందాలు జరిగినట్లు పేర్కొన్నారు. చైనా యూనివర్సిటీతో నిట్ విద్యార్థులు విద్యాసంబంధ విషయాలతో పాటు, పరిశోధనలకు పరస్పర సహకారం ఉంటుందన్నారు. రెండుసంవత్సరాలు ఈ ఒప్పందం ఉంటుందన్నారు.

రూ.1150 కోట్లతో

టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం

లక్షా 13 వేల మందికి ఉద్యోగావకాశాలు

ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

సంగెం ప్రభుత్వ కళాశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభం



సంగెంలో జూనియర్ కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

సంగెం(వరంగల్ రూరల్ జిల్లా): రాష్ట్రంలో విద్యా, ఉద్యోగ అవకాశాలతోపాటు పరిశ్రమలను నెలకొల్పేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. రూరల్ జిల్లా సంగెం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.85లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డి, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కడియం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో విద్యాపరంగా అభివృద్ధి పర్చేందుకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నట్లు చెప్పారు. అన్ని జూనియర్ కళాశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో ప్రత్యేక తరగతులను నిర్వహించే ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. సంగెం కళాశాలలో మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక నిధులను కేటాయించి మోడల్ కళాశాలగా రూపుదిద్దుతామన్నారు.

దేశంలో ఎక్కడ లేని విధంగా రూరల్ జిల్లాలోని పరకాల నియోజక వర్గంలోగల సంగెం, గీసుగొండ మండలాల్లో 1200 ఎకరాల్లో సుమారు రూ.1150 కోట్లను వెచ్చించి టెక్స్‌టైల్ పార్కును నిర్మిస్తున్నామని ఇందుకోసం టెక్స్‌టైల్ పార్కు చుట్టూ 10 కిలో మీటర్ల మేర రూ.4కోట్ల 12 లక్షల ఖర్చుతో కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టేందుకు టెండర్లను సైతం పిలిచినట్లు చెప్పారు. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుతో ఈ ప్రాంతంలోపండిన పత్తి పంటను ఇక్కడే జిన్నింగ్ చేస్తూ దుస్తుల తయారీ వరకు పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకోసం సుమారు రూ.11 వేల 521 కోట్లతో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని ఉన్నత స్థాయి ప్రమాణాలు కలిగిన కంపెనీలను ఆహ్వానించడం జరిగిందన్నారు. దీంతో ఈ ప్రాంతంలోని 1 లక్షా 13 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయన్నారు.

ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో విద్య, క్రీడా రంగానికి ప్రత్యేక నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని, ఇందుకోసం నియోజక వర్గంలో ప్రత్యేకంగా గురుకులాలను మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు నియోజక వర్గ ప్రజలు రుణపడి ఉంటారన్నారు. కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

ఆర్డీవో మహేందర్‌జీ, ఆర్‌వీఎం ఈఈ కాంతారావు, సంగెం, గీసుగొండ తహసీల్దార్లు సత్యానారాయణ, శ్రీనివాస్, సంగెం ఎంపీడీవో భద్రునాయక్, సంగెం జడ్పీటీసీ గుగులోతు వీరమ్మ, ఎంపీపీ బొమ్మాల కట్టయ్య, వరంగల్ మార్కెట్ డైరెక్టర్ గూడ సుదర్శన్, స్థానిక సర్పంచ్ మల్లికాంబ, ఎంపీటీసీ కందకట్ల కళావతి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

17న రావాలని సీఎంను ఆహ్వానించాం..

సంగెం, గీసుగొండ మండలాల పరిధిలో నిర్మించనున్న టెక్స్‌టైల్‌పార్కు పనుల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఆహ్వానించినట్లు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వెల్లడించారు. సంగెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణ పనులను ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సమాచారం అందాల్సి ఉందన్నారు.

రామప్ప ఈవోకు అదనపు బాధ్యతలు

వెంకటాపురం(రామప్ప): జయశంకర్ జిల్లా వెంకటాపురం(రామప్ప) మండలంలోని రామప్ప దేవాలయ ఎండోమెంట్ అధికారి (ఈవో) చిందం శ్రీనివాస్‌కు మరో నాలుగు దేవాలయాల అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోని రేగొండ మండలంలోని తిరుమలగిరి బుగులోని వెంకటేశ్వరస్వామి దేవాలయం, మొగుళ్లపల్లిలోని సాంబశివస్వామి దేవాలయం, రూరల్ జిల్లాలోని పరకాలలోని కుంకుమేశ్వరస్వామి దేవాలయం, మల్లక్కపేటలోని భక్తాంజనేయస్వామి దేవాలయాల ఈవోగా దేవాదాయశాఖ అదనపు బాధ్యతలు అప్పగించినట్లు చిందం శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.



సీహెచ్. శ్రీనివాస్

'కుంకుమేశ్వర' ఆలయ ఈవో బదిలీ

పరకాల(వరంగల్ రూరల్ జిల్లా) : పరకాల శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవాలయం ఎండోమెంట్ అధికారి(ఈవో) సులోచన బదిలీ అయ్యారు. ఈ మేరకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ ఉప కమిషనర్ పాలూరి రమేష్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సులోచనకు మొగుళ్లపల్లి శివాలయం తోపాటు మల్లక్కపేట భక్తాంజనేయస్వామి ఆలయం, బుగులోని వెంకటేశ్వరస్వామి ఆలయాలకు అదనపు బాధ్యతలు ఉండేవి. ఆయా విధుల నుంచి తొలగిస్తూ కోటంచ, ఇల్లంతకుంట దేవాలయాలకు ఆమెను ఈవోగా నియమించారు.

బెస్ట్ అవెలబుల్ స్కీంను వర్తింప చేయాలి : ఎమ్మార్పీఎస్

సంగెం : మండలంలో దళితులు ఎక్కువ మంది ఉన్నందున బెస్ట్ అవెల బుల్ స్కీంను వర్తింప చేయాలని మంగళవారం ఎమ్మార్పీఎస్ నేతలు మండలకేంద్రానికి వచ్చిన డిప్యూటీ సీఎం కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు యాకయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

కలెక్టరేట్ కోసం కొనసాగుతున్న నిరసనలు



మొక్కను నాటుతూ నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

పరకాల : పరకాల పాత మండలాలను కలుపుకొని రెవెన్యూ డివిజన్‌గా చేస్తూ కలెక్టరేట్‌ను పట్టణంలో ఏర్పాటు చేయాలని ప్రజలు ఉద్యమాలు చేస్తుంటే పాలకులు పట్టించుకోవడంలేదని అఖిలపక్ష నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలో కలెక్టరేట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని బస్టాండ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు డివైడర్ల మధ్య మొక్కలు నాటి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ పరకాల ప్రజల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవునూరి మేఘనాథ్, చాడ రవీందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, భాస్కర్, వీరస్వామి, రంజిత్, వీరేష్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంగా ప్రకటించాలని అఖిలపక్షం తీర్మానం

పరకాల రూరల్ : పరకాలను రూరల్ జిల్లా కేంద్రంగా ప్రకటించాలని పరకాల అఖిలపక్షం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని ముస్త్యాలపల్లి అఖిలపక్ష నాయకులు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరకాలను జిల్లా కేంద్రం లేదా పాత తాలూకా మండలాలను కలిపి రెవెన్యూ డివిజన్ చేసేంత వరకు ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌రావు, వీరస్వామి, రవీందర్‌రెడ్డి, రంజాన్, వీరన్న, శంకరయ్య, సమ్మయ్య, సత్యం, ఆదిరెడ్డి, సర్వర్, రాములు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను పెంచాలి : ఎంఈవో



నందనాయక్‌తండా పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో

గీసుగొండ : లెర్నింగ్ ఎనాహ్స్‌మెంట్ ప్రోగ్రాం(ఎల్ఈపీ)లో భాగంగా చేపట్టిన త్రీఆర్స్‌ను 60 రోజుల్లో విజయవంతంగా పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో సుజన్‌తేజ అన్నారు. మంగళవారం మండలంలోని పోతరాజుపల్లి, బొడ్డుచింతలపల్లి, కొనాయిమాకుల, గీసుగొండ, కొమ్మాల, నందనాయక్‌తండా, గట్టుకిందిపల్లి పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు కమ్రుద్దిన్, సర్వేశం, ప్రభాకర్, స్వరూప, రామ్మూర్తి పాల్గొన్నారు.

నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్‌గౌడ్

ఆత్మకూరు : డబుల్ బెడ్‌రూం పథకంలో అర్హులైన నిరుపేదలకే గృహాలు కేటాయించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వరదలా పథకాలు వస్తున్నా టీఆర్ఎస్ ప్రభుత్వమే వారి జేబులో నుంచి ఇస్తుందని ప్రచారం చేసుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. ఇప్పటికైనా గ్రామ సభల్లో అర్హులైన నిరుపేదలను ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, అధికార ప్రతినిధి సదానందం, దామెర మండల అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని

తహసీల్దార్‌కు వీఆర్‌వోల వినతి

పరకాల : వీఆర్‌వోల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ హరికృష్ణకు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వీఆర్‌వోల సంఘం నాయకులు మాట్లాడుతూ వీఆర్‌వోల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తహసీల్దార్‌ను కోరారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు యాదయ్య, కుమారస్వామి, సంపత్, రాజు, భీష్మచారి, సత్యం, జాన్‌మియా, రమ్య, అక్షిత పాల్గొన్నారు.

శాయంపేటలో...

శాయంపేట : వీఆర్వో మహేందర్ ఆత్మహత్య కారకులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వీఆర్వోలు తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వీఆర్వోల సమస్యలపై తహసీల్దార్ వెంకటభాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు భిక్షపతి, శివప్రసాద్, రఘు, సరిత, పద్మ, రామకృష్ణ, పాల్గొన్నారు.

ఆత్మకూరులో...

ఆత్మకూరు : మండల కేంద్రంలో వీఆర్వోల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలంటూ తహసీల్దార్ డీఎస్.వెంకన్నకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సంఘం నాయకుడు సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వంలో వీఆర్వోలకు పనిభారం పెరిగిందని, వేతనం మాత్రం పెరగడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే వీఆర్వోల న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వీఆర్వోల సంఘం నేతలు మల్లేషం, సత్యం పాల్గొన్నారు.



పరకాలలో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న వీఆర్‌వోలు

వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని వినతి

పరకాల : పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని తహశీల్దార్ హరికృష్ణకు ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో విజయ్, పసుల ఆనందం, విజేందర్, సదానందం, శ్రీను, రమేష్, వీరన్న, పాల్గొన్నారు.

సంగెంలో...

సంగెం : పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జన్ను యాకయ్య మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ నేతలు ఉద్యమంలో పాలు పంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండేటి శ్రీనివాస్, చిర్ర సునిల్, చాతల్ల రమేష్, పరికి యాకయ్య, పద్మ, పులమ్మ, సాయి కిరణ్, విక్రం తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఎంఈవోకు వినతి

పరకాల : తమ వేతనాలు పెంచాలని సర్వశిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులు ఎంఈవో భిక్షపతికి వినతిపత్రాన్ని అందించారు. మంగళవారం ఎంఈవో కార్యాలయంలో ఎంఆర్‌సీ, సీఆర్‌పీ, ఎంఐఎస్, కంప్యూటర్ ఆపరేటర్స్, మెసెంజర్స్, ఐఈఆర్‌టీడీలుకు చెందిన సిబ్బంది తమకు గత ఏడు సంవత్సరాల నుంచి వేతనాలు పెంచడంలేదన్నారు. సీఆర్‌పీలకు రూ. 23వేలు, ఎంఐఎస్‌లకు రూ. 25వేలు, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ. 23వేలు, ఐఈఆర్ఎస్‌లకు రూ. 26వేలు, మెసెంజర్లకు రూ. 18వేలు చెల్లించాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్డె రమేష్‌బాబు, రఘుబాబు, రఘుపతి, కవిత, శ్రీలత, కరుణ పాల్గొన్నారు.

మీజిల్స్ రుబెల్లా పై స్టాఫ్ నర్సులకు అవగాహన సదస్సు

వరంగల్ రూరల్ కల్చరల్ : మీజిల్స్ రుబెల్లా టీకాలను చిన్నారులకు ఇచ్చిన అనంతరం ఏమైనా రియాక్షన్ అయినచో తగిన విధంగా చర్యలు చేపట్టేందుకు స్టాఫ్ నర్సులకు ప్రత్యేక అవగాహన శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎస్ఎంవో(డబ్ల్యూహెచ్‌వో) కన్సల్టెంట్ డాక్టర్ ప్రగతికుమార్ తెలిపారు. మంగళవారం రూరల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వర్ధన్నపేట, నర్సంపేట డివిజన్‌లలో పనిచేసే మెప్మా (ఎఫ్)లు, స్టాఫ్ నర్సులకు, జిల్లాస్థాయి వాక్సినేటర్స్‌కు మీజిల్స్ రుబెల్లా టీకాలపై ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో డాక్టర్ ప్రగతి కుమార్ నర్సులను మెప్మా సిబ్బందికి ఎంఆర్ టీకా ఏ విధంగా ఇవ్వాలి. ఇచ్చిన తర్వాత ఏమైనా రియాక్షన్ అయినచో ఏ విధంగా నివారణ చేయాలో వివరించారు. టెక్నికల్ గా శిక్షణ నివ్వడంతో పాటు శిబిరంలో పాల్గొన్న వారితో ప్రాక్టికల్‌గా చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి. సుధీర్, డాక్టర్ రేష్మ, డాక్టర్ డి. సౌజన్య, డాక్టర్ బి. అనురాధ, డాక్టర్ బీఆర్ రాంమనోహర్‌రావు, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ కె. స్వరూపారాణి, క్రాంతి కుమార్, ఆర్‌డీ, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

డీసీపీ ఇస్మాయిల్

పరకాల రూరల్ : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీసీపీ ఇస్మాయిల్ పేర్కొన్నారు. మండలంలోని మల్లక్కపేట, రాయపర్తి గ్రామాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన హరితహారంలో భాగంగా ఏసీపీ సుధీంద్ర, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మల్లక్కపేట, రాయపర్తి గ్రామస్తులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలపై ప్రజల్లో మంచి అవగాహన వచ్చిందని ప్రతీ ఒక్కరు మొక్కలు పెంచేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ప్రతీ వ్యక్తి కనీసం పది మొక్కలు నాటి వాటిని బ్రతికించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ జాన్‌నర్సింహులు, ఎస్సై అభినవ్, మల్లక్కపేట సర్పంచ్ రాజేందర్, రాయపర్తి సర్పంచ్ సమ్మయ్య, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మైలారంలో మొక్కను నాటి నీరు పోస్తున్న డీసీపీ ఇస్మాయిల్

శాయంపేటలో...

శాయంపేట : మండలంలోని మైలారంలో మంగళవారం నిర్వహించిన హరితహారంలో డీసీపీ ఇస్మాయిల్ పాల్గొని మాట్లాడారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో మొక్కలను నాటుతున్నామన్నారు. అనంతరం 5 వేల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సుధీంద్ర, ఎస్సైలు నరేష్‌కుమార్, రాజబాబు, సర్పంచ్ సదయ్య తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖలో నియామకాల ఊసేది..?

- 15 ఏళ్లుగా ఖాళీ పోస్టుల భర్తీపై దృష్టిసారించని ప్రభుత్వాలు
- 67 పోస్టుల్లో సగానికిపైగా ఖాళీ..
- పౌరసేవల్లో తీవ్ర జాప్యం

మట్టెవాడ(వరంగల్ అర్బన్ జిల్లా)

రోజుకు 300కు పైగా కొత్త వాహనాల రిజిస్ట్రేషన్.. 6.56 లక్షల వాహనాలు.. 50 రకాల పౌర సేవలు.. ఇదీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో రవాణాశాఖ సేవల తీరు. ఇంతటి కీలకమైన శాఖలో గత 15 ఏళ్లుగా ఉద్యోగ నియామకాల ఊసే లేదు. మొత్తం 67 పోస్టులు ఉండాల్సి ఉండగా, కేవలం 36 మందితోనే కార్యకలాపాలు కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఫలితంగా పౌర సేవల్లో జాప్యం జరుగుతున్న వైనంపై కథనమిది.

వాహనాల రిజిస్ట్రేషన్.. డ్రైవింగ్ లైసెన్స్.. ఇలా దేనికి అప్లయ్ చేసినా ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడితే కానీ పనులు జరగని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితికి గల ఒకేఒక్క కారణం రవాణాశాఖలో సిబ్బంది కొరత. ఆర్టీవో, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, మినిస్టీరియల్ స్టాఫ్ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ఈ ప్రభావం పరోక్షంగా రవాణాశాఖ ద్వారా సేవలు పొందే ప్రజలపై పడుతోంది. సేవారుసుములు చెల్లించినా, రవాణాశాఖ ఆఫీసులకు పోతే తిప్పలు తప్పడం లేదంటూ వాహనదారులు వాపోతున్నారు.



వరంగల్ రవాణా శాఖ కార్యాలయం

వాహనాలు లక్షల్లో.. సిబ్బంది పదుల్లో..

నిబంధనల ప్రకారం రవాణాశాఖ కార్యాలయంలో పౌరసేవలు అందించేందుకు 8 కౌంటర్లు పనిచేయాలి. కానీ సిబ్బంది కొరతతో సగానికిపైగా కౌంటర్లు పని చేయడం లేదు. వాస్తవంగా 2 మండలాలకు ఒక అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ) ఉండాలి. కానీ ప్రస్తుతం అర్బన్ జిల్లాలోని 11 మండలాలకు ముగ్గురే ఏఎంవీఐలు ఉన్నారు. వాస్తవంగా వీరు వాహనాల తనిఖీలు చేపట్టాల్సి ఉంది. కాని ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రవాణా శాఖ కార్యాలయంలో వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, కలర్ సర్టిఫికెట్లు, ఆల్టరేషన్ ఆఫ్ వెహికిల్, వాహనాల పర్మిట్ జారీలో బిజీగా ఉండాల్సి వస్తోంది. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలు, ఆటోలు, స్కూల్ బస్సులు, ఇతర వాహనాలను తనిఖీ చేసే సమయం పనిభారం వల్ల ఏఎంవీఐలకు ఉండటం లేదు. వరంగల్ అర్బన్ జిల్లాలో మరో 3 ఏఎంవీఐ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.



ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

రవాణా శాఖ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది.. ఖాళీ పోస్టుల భర్తీ, కొత్త పోస్టుల మంజూరు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. రవాణా సంబంధిత పౌరసేవలు అందించడానికి క్లరికల్ స్టాఫ్, వాహనాల తనిఖీ కోసం ఏఎంవీఐల పోస్టుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది.

- శివ లింగయ్య, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, వరంగల్

వరంగల్ అర్బన్ జిల్లాలో..

వాహనాలు	4,46,425
కావాల్సిన సిబ్బంది	22
ప్రస్తుతం	12
కావాల్సిన ఎంవీఐలు	3
ప్రస్తుతం	1
కావాల్సిన సీనియర్ అసిస్టెంట్లు	2
ప్రస్తుతం	1

ఇప్పటివరకు భర్తీకానివి : ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్, ఎల్‌డీసీ స్టెనో, సీనియర్ డ్రైవర్, రికార్డ్ అసిస్టెంట్, కానిస్టేబుల్ పోస్టులు.

మహబూబాబాద్ జిల్లాలో..

వాహనాలు	54,204
కావాల్సిన సిబ్బంది	10
ప్రస్తుతం	5
కావాల్సిన ఎంవీఐలు	2
ప్రస్తుతం	1
కావాల్సిన ఏఎంవీఐలు	2
ప్రస్తుతం	1
కావాల్సిన కానిస్టేబుళ్లు	2
ప్రస్తుతం	1

ఇప్పటివరకు భర్తీకానివి : సీనియర్ అసిస్టెంట్, ఎల్‌డీసీ స్టెనో, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్, సీనియర్ డ్రైవర్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులు.

వరంగల్ రూరల్ జిల్లాలో..

వాహనాలు	59,939
కావాల్సిన సిబ్బంది	14
ప్రస్తుతం	7
కావాల్సిన ఎంవీఐలు	2
ప్రస్తుతం	1
కావాల్సిన ఏఎంవీఐలు	3
ప్రస్తుతం	1

ఇప్పటివరకు భర్తీకానివి : ఎల్‌డీసీ స్టెనో, సీనియర్ డ్రైవర్, రికార్డ్ అసిస్టెంట్, కానిస్టేబుల్ పోస్టులు.

జయశంకర్ జిల్లాలో..

వాహనాలు	47,816
కావాల్సిన సిబ్బంది	12
ప్రస్తుతం	7
కావాల్సిన ఎంవీఐలు	2
ప్రస్తుతం	1
కావాల్సిన జూనియర్ అసిస్టెంట్లు	2
ప్రస్తుతం	1

ఇప్పటివరకు భర్తీకానివి : ఏవో, ఎల్‌డీసీ స్టెనో పోస్ట్, సీనియర్ డ్రైవర్ పోస్ట్, రికార్డ్ అసిస్టెంట్ పోస్ట్ ఖాళీగా ఉంది. కానిస్టేబుల్ పోస్టులు.

జనగామ జిల్లాలో..

వాహనాలు	47,789
కావాల్సిన సిబ్బంది	9
ప్రస్తుతం	5
కావాల్సిన ఎంవీఐలు	1
ప్రస్తుతం	0
కావాల్సిన ఏఎంవీఐలు	2
ప్రస్తుతం	1
కావాల్సిన కానిస్టేబుళ్లు	2
ప్రస్తుతం	1

ఇప్పటివరకు భర్తీకానివి : ఎల్‌డీసీ స్టెనో, సీనియర్ డ్రైవర్, రికార్డ్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు

అడవిబిడ్డల అరిగోస



ప్రకృతి ప్రసాదించిన పచ్చల హారంతో కళకళలాడే అడవులు, గొడ్డూగోదా, జంతువులు,పక్షులు ఓ వైపు... స్వచ్ఛమైన నీటిలా నిష్కల్మష హృదయంతో పరిమళించే దృక్పథం నిండిన ఆదివాసీలు మరోవైపు! అడవితల్లి ఒడిలో పుట్టి, పెరిగే ఆదివాసీల జీవనశైలి వైవిధ్యభరితం. వేషధారణ, సంస్కృతి- సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, ఎంచుకునే ఉపాధి మార్గాలు ఇలా.. ప్రతీ అంశంలోనూ విలక్షణత్వం విస్పష్టం అవుతుంది. సాంస్కృతిక, జీవ వైవిధ్యాలు సమ్మిళితమై ప్రతిబింబించే ఆదివాసీ గూడేల్లో కనీస సౌకర్యాల కల్పనలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఆర్భాటపు ప్రకటనలు మానుకొని, ఆదివాసీల ఆర్తనాదాలు వినేందుకు సర్కారు సమయాన్ని వెచ్చించాలి. నేడు 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం' సందర్భంగా కథనమిది.

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఐక్యరాజ్యసమితి గుర్తించినా పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

వేడుకలకు సిద్ధమవుతున్న ఆదివాసీ సంఘాలు

కొత్తగూడ(మహబూబాబాద్ జిల్లా)/ ఆంధ్రజ్యోతి, భూపాలపల్లి

'అష్ట'కష్టాలు అనే పదం కూడా ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పడానికి సరిపోదు. ఎందుకంటే ఆ అడవితల్లి బిడ్డలు పడుతున్న అవస్థలు అంకెల్లో చూస్తే ఎనిమిది కంటే ఎక్కువే ఉంటాయి.. చెట్టూపుట్ట నడుమ, కొండాకోనల్లో ఉండే ఆదివాసీ గూడేల్లో అడుగడుగునా అసౌకర్యాలే దర్శనమిస్తున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి దశాబ్దాలు గడిచాయి.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆదివాసీల అభివృద్ధికి వందల కోట్ల బడ్జెట్‌నూ వెచ్చించారు. అయినా నేటికీ చాలా ఆదివాసీ గూడేలకు సమీపంలోని మండల కేంద్రాల నుంచి కనీస రోడ్డు సౌకర్యం కల్పించలేకపోయారు. ఈ కారణంగా ఆదివాసీలకు అత్యవసర ఆరోగ్య చికిత్సలు అవసరమైనప్పుడు కనీసం 108 వాహనం కూడా గూడేలకు సకాలంలో చేరుకునే పరిస్థితి లేదు. చాలాచోట్ల 108 ప్రవేశించేందుకూ వీలులేని విధంగా రోడ్లు ఛిద్రమయ్యాయి. కనీసం వీటికి మరమ్మతులు చేయించే చొరవ కూడా మానుకోట, జయశంకర్ జిల్లాలలోని ఎంపీలు, ఎమ్మెల్యేలకు లేదు. వారికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నియోజకవర్గ అభివృద్ధి నిధులను వెచ్చించి ఆదివాసీ గూడేల్లో రోడ్లకు మరమ్మతులు చేయించాల్సిన ఆవశ్యకత ప్రస్తుతముంది. లేదంటే ఈ వర్షాకాలంలో ఆదివాసీలు ఎంతో అసౌకర్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి.

గొట్టు గోత్రాలే ప్రామాణికం

ఆదివాసీలు వారి గొట్టు గోత్రాలనే ప్రామాణికంగా తీసుకుంటారు. వాటిని నెంబర్లతో పోల్చుతూ ఉంటారు. వాటిని ఆధారంగా తీసుకునే బంధుత్వ వరుసలు నిర్ధారించుకుంటారు. గొట్టు గోత్రాలను పట్టి దైవాన్ని కొలుస్తూ ఏటా జాతరలు నిర్వహించుకుంటారు. ఎవ్వరైన, ఎక్కడ ఉన్నా ఆ గొట్టు గోత్రాలకు సంబంధించిన వారు జాతరకు వచ్చి పాల్గొంటారు. వారి సంప్రదాయ నృత్యాలు, డోలీ వాయిద్యాలతో సంబురాలు జరుపుకుంటారు.

ఇలా మొదలైంది..

1994 ఆగస్టు 9న జెనీవాలో ప్రపంచ ఆదివాసీ వర్కింగ్ గ్రూపు సమావేశం నిర్వహించింది. వివిధ దేశాల నుంచి 26మంది వేధావులతో కూడి ఈ గ్రూపు రెండు దశాబ్దాల ఆదివాసీల స్థితిగతులపై అధ్యయనం చేసింది. ప్రపంచ దేశాల్లో ఆదివాసీల సమస్యలు ఒకేలా ఉన్నాయని గుర్తించి ఏటా ఆగస్టు 9న ఆదివాసీల దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించింది. 1994 నుంచి 2014వరకు రెండు దశాబ్దాల కాలాన్ని ఆదివాసీల దశాబ్దాలుగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.

ఐటీడీఏ చోద్యం.. అసౌకర్యాల రాజ్యం..

గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు, వారి అభివృద్ధికి తోడ్పడేందుకు జయశంకర్ జిల్లా ఏటూరునాగారంలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)ను ఏర్పాటు చేశారు. ఐటీడీఏ ద్వారా ఆశించిన ఫలితాలు పూర్తిగా దక్కలేదు అనేందుకు.. ప్రస్తుతం ఆదివాసీ గూడేల్లో రాజ్యమేలుతున్న సమస్యలనే సాక్ష్యాలుగా భావించొచ్చు. అపరిశుభ్ర పరిసరాలు, పత్తాలేని రోడ్లు, మురుగు కాల్వలు, కలగా మిగిలిన రక్షిత తాగునీటి సౌకర్యం, దోమల స్వైరవిహారం ఇలా.. సవాలక్ష సమస్యలు ఆదివాసీలను ముసురుకొని ముప్పుతిప్పలు పెడుతున్నాయి. అయినా ఐటీడీఏకు చీమకుట్టినట్లయినా లేదు. దళారులు, దోపిడీదారులు బినామీల పేరిట అడ్డదారిలో ఆదివాసీల నిధులను పక్కదారి పట్టిస్తున్నారని ఆదివాసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వం కేటాయించే నిధులు అర్హులకే దక్కేలంటే.. ఐటీడీఏ పాలనా వ్యవస్థను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దాలి. ఇందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకోవాలి.

దేశంలోని ఆ 33 తెగలే ఆదివాసీలు

అడవి ప్రాంతంలో స్థిరనివాసం కలిగిన 33 తెగల సమూహాలను ఆదివాసీలుగా భారత ప్రభుత్వం గుర్తించింది. 1960 జనవరి 20 నుంచి రాజ్యాంగంలో 366వ ఆర్టికల్‌లో సూచించిన 25 నిబంధనల ప్రకారం వీరిని గుర్తించారు. వీరినే గిరిజనులు, గిరిపుత్రులు, అడవి బిడ్డలు, వనవాసీలు, మూలవాసులు, ఆదివాసీలుగా పిలుస్తారు. రాష్ట్ర విభజన జరిగిన తరువాత తెలంగాణ పరిధిలోకి 13 తెగలు వచ్చాయి.

కొత్త జిల్లాలతో మరింత అగాధం..

కొత్త జిల్లాల ఏర్పాటుతో జయశంకర్, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో ఆదివాసీల అభివృద్ధి మరింత అగాధంలోకి పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం పాలనా సౌలభ్యం రీత్యా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ఇందుకోసం అప్పటివరకు ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆదివాసీ ప్రాంతాలను వేరుచేసింది. దీంతో ఆదివాసీలు ఐటీడీఏకు దూరమయ్యారనే భావన ఉంది. ఆదివాసీ ప్రాంతాలను కలిపి గిరిజన జిల్లాగా ప్రకటించాలనే డిమాండ్ వినిపించినా సర్కారు దాన్ని తోసిపుచ్చింది. ఆదివాసీ ప్రాంతాల విభజనతో ఐటీడీఏ పరిధిలోని 3 జిల్లాల ఐటీడీఏ అధికారులకు సమన్వయం లోపించే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి సహకారం ఇచ్చిపుచ్చుకునే విషయంలో ఆయా జిల్లాల ఐటీడీఏ అధికారులు ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ఎంపీలు, ఎమ్మెల్యేలు సైతం కృషిచేయాలి.



కొత్తగూడ మండలంలోని సాధిరెడ్డిపల్లిలో అధ్వానంగా రోడ్డు



మహబూబాబాద్ జిల్లాలోని మడగూడలో నిర్వహిస్తున్న ఆదివాసీ జాతరలో ఆదివాసీలు







నేడు ఏఎస్‌పీ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం

మానుకోట జిల్లా కేంద్రంలో నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సన్నాహాలు చేస్తోంది. భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మోకాళ్ల వెంకటేష్ ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాలలోని ఆదివాసీలను మానుకోటకు తరలించేందుకు కార్యాచరణ రూపొందించారు. అలాగే కొత్తగూడ, గంగారం మండలాల్లో సైతం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకునేందుకు గిరిజన సంఘాలు సమాయత్తమవుతున్నాయి.

అడవే జీవనాధారం...

గిరిజనులకు అడవే ఆధారంగా మారింది.. అడవిలో లభిస్తున్న ఉత్పత్తులపైనే వీరి బతుకులు ఆధారపడి ఉన్నాయి. ముఖ్యంగా ఆదివాసీల్లో 68శాతం మంది అడవి ఉత్పత్తులను విక్రయిస్తూ జీవిస్తున్నారు. చిల్లగింజలు, ముష్టిగింజలు, చీపుర్లు, తునికి పండ్లు, బోడ కాకరకాయలు, ఇప్పపువ్వు, తబ్బిబంక, తేనె, పరికిపండ్లు, నేరేడుపండ్లు, పుసుకుపండ్లు, పాలపండ్లు తదితర పండ్లను సేకరించి అంగన్‌వాడీలతోపాటు, గ్రామాల్లో తిరుగుతూ విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పండ్ల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతో తమకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసుకుంటున్నారు. పాత బట్టలు, నూకల బియ్యం, పూసల దండలు, అద్దాలు, బొట్లు, బొట్టుపిల్లలు కొనుగోలు చేసి వినియోగించుకుంటారు. వీటితోపాటు అడవిలో లభించే ఈత, వెదురు బొంగులతో చాటలు, గంపలు, తడకలు తదితర వస్తువులు తయారు చేసి విక్రయించుకుంటారు. ఇలా అటవీ సంపదనే వీరి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుంది.

1974లో ఐటీడీఏల ఏర్పాటు...



భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం 1100 ఏళ్ల ఆదివాసీలు పోరాటం ఫలితంగా ఆదివాసీలకు ప్రత్యేక బడ్జెట్‌తో నిధులు, పథకాలు అందించాలనే లక్ష్యంతో 1974లో ఐటీడీఏలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టులోకి పలు శాఖలను చేర్చుకుని పాలన చేపడుతున్నాయి.

అధికారికంగా వేడుకలు నిర్వహించాలి



ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి. షెడ్యూల్ ప్రాంతంలోని విద్యాసంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినం ప్రకటించాలి. ప్రభుత్వ అధికారులే ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా ఆదివాసీల్లో మనోధైర్యం పెరుగుతుంది. 1/70 చట్టం, పీసాచట్టాలు పకడ్బంధీగా అమలు చేయాలి. పోడు భూములకు ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లో హరితహారం నాటేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలి. నాన్‌ట్రైబల్ ఆక్రమించుకున్న అటవీ భూములను స్వాధీనం చేసుకుని వాటిలో హరితహారం చేపట్టాలి.

- పులిసె బాలకృష్ణ, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు.

నిధులను దారిమళ్లించేందుకు కుట్ర



ఆదివాసీలకు ఐక్యరాజ్యసమితి నుంచి గ్రామ స్థాయి వరకు కొన్ని ప్రత్యేకమైన హక్కులు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన చట్టాల అమలులో పాలకులు విఫలమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఆదివాసీ నిధులను దారి మళ్లించేందుకు కుట్రలు జరుగుతున్నాయి. ఇప్పటికైన పాలకులు ఆదివాసీ ప్రాంతాలపై దృష్టిసారించాలి.

- పూనెం శ్రీనివాస్, ఏఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు



చట్టాలను అమలు చేయాలి

ఆదివాసీల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న చట్టాలను పకడ్బంధీగా అమలు చేయాలి. 1/70చట్టం అమలు చేసి షెడ్యూల్ ప్రాంతంలో నాన్‌ట్రైబల్ ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకుని ట్రైబల్స్‌కు పంపిణీ చేయాలి. పీసా చట్టాన్ని పకడ్బంధీగా అమలు చేయాలి. ఆదివాసీల సంక్షేమం కోసం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కోనేరు రంగప్ప కమిటీ చేసిన 30 సిఫారసులను తక్షణమే అమలు చేయాలి. విద్య, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

- కొమురం ప్రభాకర్, తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు.

గిరిజన ఆస్తులపై వాలుతున్న గద్దలు..

1969లో భారత ప్రభుత్వం గిరిజనుల ఆస్తులను గిరిజనేతరులు కొనుగోలు చేయరాదని మరో సవరణ ద్వారా చట్టం చేసింది. అయితే తెలంగాణలో 1963నుంచే ఈ చట్టం అమలు చేస్తున్నారు. 1970లో ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలులోకి తీసుకువచ్చారు. వీటితోపాటు పీసా చట్టం, 1/70 చట్టం, పంచాయతీరాజ్ చట్టం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. జయశంకర్ జిల్లాలోని తుపాకులగూడెం బ్యారేజీ కింద వందలాది ఎకరాల గిరిజనుల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం పట్ల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు 1/70 చట్టం ప్రకారం గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులకు స్థిరాస్తులు ఉండకూడదని చెబుతోంది. అయితే ఏటూరునాగారం లాంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలో వేలాది ఎకరాల భూములు గిరిజనేతరుల చేతుల్లో ఉన్నాయి.

వెలుగుల 'నగరం'లో.. చీకటి బతుకులు

- విద్యుత్ కనెక్షన్‌కూ నోచుకోని నిరుపేద ఇళ్లు
- తల్లి అంధురాలు, పిల్లలంతా మానసిక రోగులే..
- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృత్యువాత
- సాయం కోసం ఎదురుచూపులు

కాకతీయ కాలనీ(వరంగల్ అర్బన్ జిల్లా)

'గ్రేటర్' కిరీటం తొడిగిన వరంగల్ మహానగరమది.. నగరంలోని 30వ డివిజన్ పరిధిలో కాకతీయ కాలనీ ఉంది. అక్కడి ఓ ప్లాటులోని చిన్న రేకుల గదిలో నివాసముంటోంది ఓ కడుబీద కుటుంబం. వారికి పగలు, రాత్రి ఏ వేళయినా ఒక్కటే. ఎందుకంటే ఆ ఇంటికి విద్యుత్ సౌకర్యం ఇప్పటిదాకా లేదు. కుటుంబాన్ని పోషించే వ్యక్తులు లేక, మానసిక స్థితి సరిగా లేని కుమార్తెలు, కొడుకుని ఎలా పోషించుకోవాలో తెలియక ఆ తల్లి మణెమ్మ తల్లడిల్లుతోంది.

ఒకప్పుడు బాగానే బతికి..

ఇంటి యజమాని బతికున్నపుడు ఆ ఇంటిల్లిపాదీ సుఖసంతోషాలతో ఉండేవారు. ఆ కుటుంబంలోని ఆరుగురు సంతానంలో ముగ్గురు కుమార్తెలకు పెళ్లి చేశారు. ఏం జరిగిందో ఏమో కాలం కన్నెర్ర చేసింది. కుటుంబ యజమాని రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. ఆ రోజు నుంచి ఆ కుటుంబానికి కష్టాలు మొదలయ్యాయి. రెండేళ్ల క్రితం వారు కాకతీయ కాలనీకి వచ్చి స్థిరపడ్డారు. మానసిక స్థితి సరిగ్గా లేని పిల్లలతో అంధురాలైన మణెమ్మ ఉంటోంది. వృద్ధాప్యంలోనూ కుటుంబ భారాన్ని మోస్తోంది. ఇక్కడ కూడా బతకడానికి నానా కష్టాలు పడుతున్నారని స్థానికులు తెలిపారు. పలకరిస్తేనే తప్ప మాట మాట్లాడని, ఆ కుటుంబం సమస్యలను ప్రభుత్వమే పరిష్కరించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.



మణెమ్మ కుటుంబ సభ్యులు ఉండేది ఈ రేకుల గదిలోనే..

వర్ణమాల అక్షరాల దిశలు తెలిస్తే జవాబు సులువే..!

అనాలజీ (పోలిక పరీక్ష)

మోడల్ - 1

1. **ఖురాన్: మహ్మదీయులు:: జెండ్ అవస్థా: -----**
ఎ) జొరాస్ట్రియన్ బి) షింటో సి) అజీవక డి) పారశీక
సమాధానం: **ఎ**
వివరణ: మహ్మదీయుల పవిత్ర గ్రంథం ఖురాన్. అలాగే జొరాష్ట్రియన్ల పవిత్ర గ్రంథం జెండ్ అవస్థా

2. **నవంబరు 14 : బాలల దినోత్సవం :: జూన్ 5 : ------**
ఎ) యువజన దినోత్సవం
బి) పర్యావరణ దినోత్సవం
సి) ఆహార దినోత్సవం డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: నవంబరు 14 బాలల దినోత్సవం. అలాగే జూన్ 5 పర్యావరణ దినోత్సవం

3. **శాకాహారి: ఆవు :: మాంసాహారి: ---------**
ఎ) జింక బి) మేక సి) గొర్రె డి) సింహం
సమాధానం: **డి**
వివరణ: ఆవు శాకాహారి. అలాగే ఇచ్చిన ఐచ్ఛికాల్లో సింహం మాంసాహారి

4. **రక్తం: ఎరుపు :: బొగ్గు : -----------**
ఎ) పసుపు బి) ఆకుపచ్చ సి) నలుపు డి) గులాబి
సమాధానం: **సి**
వివరణ: రక్తం ఎరుపు రంగులో ఉంటుంది. బొగ్గు నలుపు రంగులో ఉంటుంది

5. **ఉదయం: సాయంత్రం :: రాత్రి : -----**
ఎ) పగలు బి) సాయంత్రం
సి) మధ్యాహ్నం డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: ఉదయానికి వ్యతిరేకం సాయంత్రం, అలాగే రాత్రికి వ్యతిరేకం పగలు

6. **గడియారం: సమయం :: ధర్మామీటర్ : -------**
ఎ) ఉష్ణం బి) ఉష్ణోగ్రత సి) శక్తి డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ: సమయాన్ని తెలిపేది గడియారం, ఉష్ణోగ్రతను తెలిపేది ధర్మామీటర్

7. **సిక్కిం: గాంగ్‌టక్ :: మణిపూర్ : ------**
ఎ) డిస్పూర్ బి) షిల్లాంగ్ సి) ఇంఫాల్ డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: సిక్కిం రాష్ట్ర రాజధాని గాంగ్‌టక్. అలాగే మణిపూర్ రాజధాని ఇంఫాల్

8. **క్యాలెండర్ : తేదీలు :: నిఘంటువులు : ------**
ఎ) భాష బి) వాక్యాలు సి) పదాలు డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: క్యాలెండర్‌లో తేదీలు ఉంటాయి. అలాగే నిఘంటువులో పదాలు ఉంటాయి

9. **కిలోగ్రాం : క్వింటాల్ :: పైసా : ------**
ఎ) రూపాయి బి) నాణెం సి) సంపద డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: వంద కిలోగ్రామ్‌లు ఒక క్వింటాల్. అలాగే వంద పైసలు అంటే ఒక రూపాయి.

10. **సముద్రగుప్తుడు: ఇండియన్ నెపోలియన్ :: కాళిదాసు : ------**
ఎ) ఇండియన్ ఐన్‌స్టీన్
బి) ఇండియన్ మాఖియ వెల్లి
సి) ఇండియన్ షేక్‌స్పియర్ డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: సముద్ర గుప్తుని బిరుదు ఇండియన్ నెపోలియన్ అలాగే కాళిదాసు బిరుదు ఇండియన్ షేక్‌స్పియర్

11. **నిరక్షరాస్యత : విద్య :: వరద : -------**
ఎ) వంతెన బి) సముద్రం సి) ఆనకట్ట డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: నిరక్షరాస్యత తొలగాలంటే విద్యావంతులు కావాలి. అదేవిధంగా వరదల నుంచి రక్షణకై ఆనకట్టలు నిర్మించాలి.

12. **ప్రోటీన్స్: పెరుగుదల:: కార్బోహైడ్రేట్స్: ------**
ఎ) శక్తి బి) బలం సి) వ్యాధి డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ: పెరుగుదలకు ప్రోటీన్స్, తక్షణ శక్తికి కార్బోహైడ్రేట్స్ ఉపయోగపడతాయి.



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 2

వర్ణమాల అక్షరాలతో పోలిక పరీక్ష

- ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో వర్ణమాల అక్షరాల సమూహాన్ని ఇచ్చి దానిని ఒక క్రమ పద్ధతిలో కొత్త అక్షరాలుగా మారుస్తారు. అంతేకాక మరో వర్ణమాల అక్షరాల సమూహాన్ని ఇస్తారు. అభ్యర్థి మొదటి వర్ణమాల అక్షరాల సమూహం ఏ పద్ధతిలో మార్చారో పరిశీలించి ఇచ్చిన మరో వర్ణమాల అక్షరాల సమూహాన్ని అదే పద్ధతిలో మార్చి రాయాలి.
- ఈ మోడల్‌కు సంబంధించిన ప్రశ్నలకు త్వరగా సమాధానం గుర్తించాలంటే వర్ణమాల అక్షరాల సవ్యదిశ, అపసవ్యవదిశ సంఖ్యలు తెలిసి ఉండటం చాలా అవసరం.

సవ్యదిశ వర్ణమాల - సంఖ్యలు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
A	B	C	D	E	F	G	H	I	J	K	L	M	N
15	16	17	18	19	20	21	22	23	24	25	26		
O	P	Q	R	S	T	U	V	W	X	Y	Z		

అపసవ్యవదిశ వర్ణమాల - సంఖ్యలు

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
Z	Y	X	W	V	U	T	S	R	Q	P	O	N	M
15	16	17	18	19	20	21	22	23	24	25	26		
L	K	J	I	H	G	F	E	D	C	B	A		

1. **ADG: CFI :: MPS: ----------**
ఎ) PRU బి) OSU సి) ORU డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: ఈ ప్రశ్నలో అక్షరాలు +2 సిద్ధాంతాన్ని అనుసరించినవి. ADG ని CFI గా రాశారు.
అంటే A మొదటి అక్షరం C(A + 2 = C) మూడో అక్షరం
D నాలుగో అక్షరం, F ఆరో అక్షరం (D + 2 = F)
G ఏడో అక్షరం, I తొమ్మిదో అక్షరం (G + 2 = I) అలాగే
M పదమూడో అక్షరం, O పదిహేనో అక్షరం (M + 2 = O)
P పదహారో అక్షరం, R పద్దెనిమిదో అక్షరం (P + 2 = R)
S పందొమ్మిదో అక్షరం, U ఇరవై ఒకటో అక్షరం(S + 2 = U)
కాబట్టి సమాధానం ORU అవుతుంది

2. **FDB: HFD :: NLJ : ------------**
ఎ) KLN బి) PNL సి) QNK డి) ఏదీకాదు
సమాధానం: **బి**

6	4	2		4	12	10
F	D	B		N	L	J
+2	+2	+2	అలాగే	+2	+2	+2
H	F	D		P	N	L
8	6	4		16	14	12

3. **FAME: JEQI :: LOVE: -------**
ఎ) PSZI బి) PRYK సి) PSXJ డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

6	1	13	5		12	15	22	5
F	A	M	E		L	O	V	E
+4	+4	+4	+4		+4	+4	+4	+4
J	E	Q	I		P	S	Z	I
10	5	17	9		16	19	26	9

4. **JOY: MQZ :: KNR : -----------**
ఎ) MMR బి)NPS సి) LMS డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ:

10	15	25	11	14	18
J	O	Y	K	N	R
+3	+2	+1	+3	+2	+1
M	Q	Z	N	P	S
13	17	26	14	16	19

5. **KIG : MMM :: MLK : ----------**
ఎ) QRP బి) PQR సి) OPQ డి) ఏదీకాదు
సమాధానం: **సి**

11	9	7	13	12	11
K	I	G	M	L	K
+2	+4	+6	+2	+4	+6
M	M	M	O	P	Q
13	13	13	15	16	17

6. **HEN : FCL :: IHG: ----------**
ఎ) GFE బి) EFG సి) FGE డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

8	5	14	9	8	7
H	E	N	I	H	G
-2	-2	-2	-2	-2	-2
F	C	L	G	F	E
6	3	12	7	6	5

7. **FENR: DILV :: SALT : ------------**
ఎ)PEJY బి) QFJY సి) QEJY డి) QEJX
సమాధానం: **డి**

6	5	14	18	19	1	12	20
-2	+4	-2	+4	-2	+4	-2	+4
D	I	L	V	Q	E	J	X
4	9	12	22	17	5	10	24

8. **TRK: QPJ :: NKF : ---------**
ఎ) KIE బి) KJF సి) JJE డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

20	18	11	14	11	6
T	R	K	N	K	F
-3	-2	-1	-3	-2	-1
Q	P	J	K	I	E
17	16	10	11	9	5

9. **BOLD: CQOH :: KITE : ----------**
ఎ) LWKJ బి) LKWI సి)KLXJ డి) ఏదీకాదు
సమాధానం: **బి**
వివరణ:

2	15	12	4	11	9	20	5
B	O	L	D	K	I	T	E
+1	+2	+3	+4	+1	+2	+3	+4
C	Q	O	H	L	K	W	I
3	17	15	8	12	11	23	9

10. **MNR: GJP :: KPT : ---------**
ఎ) ELR బి) EJP సి) DJP డి) ఏదీకాదు
సమాధానం: **ఎ**
వివరణ:

13	14	18	11	16	20
M	N	R	K	P	T
-6	-4	-2	-6	-4	-2
G	J	P	E	L	R
7	10	16	5	12	18

11. **NF: SK :: GJ : ----------**
ఎ) NP బి) PQ సి) LO డి) ఏదీకాదు
సమాధానం: **సి**
వివరణ: N పద్నాలుగో అక్షరం, S పందొమ్మిదో అక్షరం (N + 5 = S)
F ఆరో అక్షరం, K పదకొండో అక్షరం (F + 5 = K)
G ఏడో అక్షరం, L పన్నెండో అక్షరం (G + 5 = L)
J పదో అక్షరం, O పదిహేనో అక్షరం (J + 5 = O)
